నవతెలంగాణ

మెదక్

1

శుక్రవారం | 13 సెప్టెంబరు 2024 | www.navatelangana.com

750 గ్రాములు గంజాయి పట్టివేత

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం



పారిశ్రామిక వాడలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకుని.. వారి వద్ద నుంచి 750 గ్రాముల ఎండు గంజాయిని గురువారం పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బొల్లారం మున్సి పల్ పరిధిలోని మల్లన్న బస్తీలో యశ్వంత్‌రెడ్డి, మల్లిఖార్జున అనే ఇద్దరు యువకులు బొల్లారం పారిశ్రామిక వాడలోని ఓ ప్రైవేట్ పరిశ్రమలో పనిచేస్తున్నారు. కాగా వారు గంజాయిని చిన్న చిన్న ప్యాకెట్లు చేసి విక్రయిస్తున్నారు. నమ్మద గిన సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి వారి వద్ద నుంచి 750 గ్రాములు ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.ఆ యువకులను అదుపులోకి తీసుకున్నారు.





నేల రాలిన..

విప్లవ ధృవతార ఏచూరి





- విద్యార్థి దశ నుంచి సమాజ దృక్పథం
- సీపీఐఎం రాజకీయాల్లో ఐదు దశాబ్దాల ప్రస్తానం
- ఉత్తమ పార్లమెంటేరియన్‌గా సేవలు
- ఉమ్మడి మెదక్ జిల్లా ఉద్యమంతో మమేకం
- 1999 అసెంబ్లీ ఎన్నికల సభకు హాజరైన ఏచూరి
- 2015లో పార్టీ రాష్ట్ర ప్లీనరీ సమావేశాలు...
- మహాజన పాదయాత్ర 1000 కిలో మీటర్ల సభ హాజరు
- ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా సంతాప సభలు, ఘన నివాళ్లు

విప్లవ ధృవతార... మార్క్సిస్టు జ్ఞాని... రాజనీతిజ్ఞులు... ఆర్థిక, రాజకీయ, సామాజిక, సైద్ధాంతిక విశ్లేషకులు సీపీఐఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ఇక లేరన్న వార్త మార్క్సిస్ట్ పార్టీ శ్రేణుల ఆలోచన సహించడంలేదు. 73 ఏళ్ల సీతారాం ఏచూరి జీవిత కాలమంతా సమాజం, కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణం, ప్రపంచ కమ్యూనిస్టుల ఐక్యత కోసం ధార పోశారు. చదువునే రోజుల్లోనే వామపక్ష బావజాలాన్ని విద్యార్థిలోకంలో వ్యాప్తి చేయడంతో పాటు మార్క్సిస్టు సిద్ధాంతం పట్ల లోతైన చింతన కల్గిన ఏచూరి అచ్చమైన తెలుగు బిడ్డ కావడంతో ఈ ప్రాంత వామపక్ష శక్తులు గర్వపడే కీర్తిని ఆయన ఘడించారు. కమ్యూనిస్టు పార్టీ నాయకుడిగానే కాకుండా మూడు పర్యాయాలు పార్లమెంట్‌కు ప్రాతినిధ్యం వహించి ఉత్తమ పార్లమెంటేరియన్‌గా గుర్తింపు పొంది అన్ని పార్టీల నేతల చేత అభినందించబడ్డారు. సీపీఐఎంలో కేంద్ర కమిటీ సభ్యులుగా పొలిట్‌బ్యూరో మెంబర్‌గా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన ఏచూరి గురువారం మధ్యాహ్నం ఢిల్లీ ఎయిమ్స్ ఆసుపత్రిలో తుది శ్వాస విడిచారు. ఆయన మరణం పట్ల ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా సీపీఐఎం, సీపీఐ ఇతర వామపక్ష శ్రేణులు తీవ్ర విషాదాన్ని వ్యక్తం చేశాయి. పలు ప్రాంతాల్లో ఏచూరికి ఘనంగా నివాళ్లు అర్పిస్తూ సంతాపం వ్యక్తం చేశారు. ఉమ్మడి మెదక్ జిల్లా సీపీఐఎం ఉద్యమంలో సీతారాం ఏచూరి ప్రత్యకంగా పాల్గొన్న సందర్భాలున్నాయి. ఆ జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు.

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి మెదక్ జిల్లాతో ఏచూరి అనుబంధం

1974లో ఎస్ఎఫ్ఐలో చేరిన సీతారం ఏచూరి మరుసటి ఏటే సీపీఐఎంలో సభ్యులుగా చేరారు. ఢిల్లీ జేఎన్‌యూలో ఉన్నత చదువులు చదువుతూనే ఎస్ఎఫ్ఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా అధ్యక్షులుగా పనిచేశారు. అనంతరం సీపీఐఎం కేంద్ర కమిటీ సభ్యులుగా పార్టీ బాధ్యతలు చూస్తూ మార్క్సిస్టు పార్టీ ఉద్యమ నిర్మాణంలో కీలక పాత్ర పోషించారు. దేశ వ్యాప్తంగా పార్టీని బలోపేతం చేయడంలో భాగంగా ఉమ్మడి మెదక్ జిల్లాలో కూడా సీపీఐఎం ఉద్యమ విస్తరణలోనూ సీతారం ఏచూరి ప్రత్యకంగా భాగస్వాములయ్యారు. పార్టీ నిర్వహించిన ముఖ్యమైన సభలు, సమావేశాలకు ఆయన సంగారెడ్డి, సదాశివపేట, మెదక్ ప్రాంతాలకు వచ్చారు. పార్టీ జాతీయ నాయకులు, జాతీయ ప్రధాన కార్యదర్శి హోదాలో ఈ ప్రాంత పార్టీ ఉద్యమ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. 1999లో జరిగిన ఆంధ్రప్రదేశ్ శాసన సభా ఎన్నికల్లో సీపీఐఎం రాష్ట్ర వ్యాప్తంగా పోటీ చేసింది. ఆ ఎన్నికల్లో బలమైన కార్మిక వర్గంలో పట్టు ఉన్న సీపీఐఎం కూడా పటాన్‌చెరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేసింది. కార్మికోద్యమ నాయకులుగా సీపీఐఎం జిల్లా ఉద్యమ నాయకులుగా ఉన్న చుక్క రాములు ఆ ఎన్నికల్లో పటాన్‌చెరు నుంచి సీపీఐఎం అభ్యర్థిగా పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపు కోసం సదాశివపేటలో నిర్వహించిన భారీ ఎన్నికల బహిరంగ సభకు పార్టీ కేంద్ర నాయకులుగా సీతారాం ఏచూరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆ ఎన్నికల్లో దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ అవినీతి రాజకీయాలు, బీజేపీ మతోన్మాద పోకడలను ఎండగడుతూ వామపక్షాలను గెలిపించాలని ఆయన పిలుపు నిచ్చారు. సంగారెడ్డి,



పటాన్‌చెరు ప్రాంతంలో విస్తరించిన పారిశ్రామిక రంగంలో సంపదను సృష్టిస్తున్న కార్మికుల హక్కులు కాపాడుతూ కనీస వేతనాలు, ఇతర సదుపాయాల కోసం పోరాడుతున్న సీపీఐఎం అభ్యర్థి చట్ట సభలోకి పంపాలని ఆయన ప్రజలకు పిలుపు నిచ్చారు. ఆ ఎన్నికల్లో సీపీఐఎం అభ్యర్థి చుక్క రాములు గణనీయమైన ఓట్లు సాధించడం ద్వారా జిల్లాలో పార్టీ విస్తరణకు దోహదపడింది. అదే విధంగా తెలంగాణ ఆవిర్భవం తర్వాత సీపీఐఎం నిర్వహించిన 'మహాజన పాదయాత్ర' ఓ మైలురాయిగా నిలిచిపోయింది. కొన్ని పార్టీలు అస్థిత్వ రాజకీయాలతో భ్రమలు కల్పిస్తూ ప్రజల్ని మభ్యపెట్టి రాజకీయ ప్రయోజనం పొందుతున్న తరుణంలో సీపీఐఎం తనదైన పంథాలో ప్రజా సమస్యల్ని అధ్యయనం చేసి పోరాటాలు సాగించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా సాగిన మహాజన పాదయాత్ర మెదక్ జిల్లా చేగుంటకు చేరింది. 1000 కిలో మీటర్ల మేర పాదయాత్ర సాగిన సందర్భంగా చేగుంటలో పార్టీ నిర్వహించిన భారీ జన సభకు సీతారాం ఏచూరి పాల్గొన్నారు. తెలంగాణలో పార్టీ చేపట్టిన మహాజన పాదయాత్ర పోరాట చరిత్రగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఏచూరి సభకు హాజరై పాదయాత్ర చేసే నాయకత్వంలో మరింత చైతన్యం నింపారు. అదే విధంగా తెలంగాణ ఏర్పడిన తర్వాత సంగారెడ్డి పట్టణంలో సీపీఐఎం రాష్ట్ర ప్లీనరీ సమావేశాలు జరిగాయి. 2015 నవంబర్ 29, 30 తేదీల్లో సంగారెడ్డిలోని రెడ్‌లాస్‌లో ప్లీనరీ సమావేశాలు నిర్వహించారు. ఆ ప్లీనరీ సమావేశాలకు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా సీతారాం ఏచూరి హాజరయ్యారు. ఏచూరితో పాటు పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు కూడా హాజరయ్యారు. కేవల్ కిషన్ భవన్ ఎదుట పార్టీ జెండాను ఆయన ఆవిష్కరించారు. పార్టీ ప్లీనరీ సమావేశాల్లో పాల్గొని తెలంగాణ పార్టీ ఉద్యమ విస్తరణపై దశ దిశను నిర్దేశించారు. ఆ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో కూడా ఏచూరి పాల్గొని ప్రసంగించారు. ఈ మూడు సందర్భాల్లో ఉమ్మడి మెదక్ జిల్లా సీపీఐఎం ఉద్యమంలో మమేకమైన ఏచూరితో ఈ ప్రాంత నాయకులు ప్రత్యక్షంగా కలవడం, మాట్లాడడం, మెతుకు సీమ రైతాంగ కష్టాల్ని వివరించడం, వినతిపత్రం ఇవ్వడం వంటి జ్ఞాపకాలున్నాయి. ఉమ్మడి మెదక్ జిల్లా పార్టీ కార్యదర్శిగా పనిచేసిన చుక్కరాములు, ఎ.మల్లేశంతో పాటు పార్టీ నాయకులు బి.మల్లేశం, గొల్లపల్లి జయరాజు, కె.రాజయ్య, మాణిక్యం ఇతర నాయకులు ఏచూరితో ప్రత్యక్షంగా కలిసిన జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ప్లీనరీ సమావేశాలకు వచ్చిన సందర్భంగా వాలంటీర్లుగా పనిచేసిన అనేక మంది యువ నాయకులున్నారు. వారంతా ఏచూరి జ్ఞాపకాలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. భౌతికంగా లేకపోయినా ఆశయ రూపంలో తమ మదిలోనే ఏచూరి పదిలంగా ఉంటారంటూ ఆయన చూపిన బాటలో నడుస్తామంటూ ఘనంగా నివాళ్లు అర్పించారు. సంగారెడ్డి, సిద్దిపేట, మెదక్, పటాన్‌చెరు, దుబ్బాక, గజ్వేల్ వంటి ప్రాంతాల్లో ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించి సంతాపం వ్యక్తం చేశారు. పార్టీ శాఖలున్న చోట పార్టీ జెండాలను అవగతం చేశారు. వారం రోజుల పాటు సంతాప సభలు నిర్వహించాలని పార్టీ మూడు జిల్లాల కార్యదర్శులు గొల్లపల్లి జయరాజు, ఎ.మల్లేశం, ఆముదాల మల్లారెడ్డి పార్టీ శ్రేణులక పిలుపు నిచ్చారు.





సామర్థ్యం అంచనా ప్రోత్సహకరంగా ఉండాలి

పరీక్ష పేపర్లు, మూల్యాంకన రూపకల్పన కార్యశాల

ముఖ్య అతిథి డాక్టర్ లీనా

నవతెలంగాణ-పటాన్‌చెరు

విద్యార్థి సామర్థ్యాలను పరిశీలించే పద్ధతి, మూల్యాంకన విధానాలను ప్రోత్సహించి, మరింత పూనికతో పనిచేసేలా ఉండాలని ఇఫ్లూ విశ్వవిద్యాలయం, లఖిల భారత భాషోపా ధ్యాయుల సంఘం డైరెక్టర్ డాక్టర్ లీనా ముఖోపాధ్యాయ స్పష్టీకరించారు. గీతం స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, హైదరాబాద్ ఆధ్వర్యంలో 'ప్రభావవంతంగా పరీక్ష పేపర్లు అభివృద్ధి చేయడం: బ్లూమ్ యొక్క వర్గీకరణ, మూల్యా ంకన రూపకల్పన అనే అంశంపై గురువారం నిర్వహించిన ఒకరోజు కార్యశాలలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడు తూ.. కంటెంట్ మూల్యాంకనం యొక్క క్లిష్టమైన అంశాలపై ప్రస్తుతం అధ్యాపకులు ఎదుర్కొంటున్న సమస్యలు, సవాళ్లను పరిష్కరించేలా పలుసూచనలతో కార్యక్రమాన్ని కొనసాగించారు. ప్రభావంతమైన కంటెంట్‌ను అభివృద్ధి చేయడానికి సవరించిన బ్లూమ్ వర్గీకరణ, కాగ్ని షన్ పరికల్పన ఆవశ్యకతను ఆమె నొక్కి చెప్పారు. గుర్తుం చుకోవడం, అర్థం చేసుకోవడం, విశ్లేషించడం, మూలా ్యంకనం చేయడం, సృజనాత్మకంగా వ్యవహరించడం వంటి ముఖ్య



అంశాలపై దృష్టి సారించారు. విద్యార్థి సామర్థ్యాన్ని మదింపు చేసేవారిగా ఉపాధ్యాయుల పాత్ర, అభ్యాస, ప్రక్రియలో విద్యార్థుల ఏకాగ్రతను పెంపొందించడంపై ప్రసంగించారు. జీఎస్‌హెచ్ఎస్ డైరెక్టర్ ప్రొఫెసర్ జి.సన్నీ జోస్ కార్యక్రమాన్ని ప్రారంభించి, ముఖ్య అతిథిని సత్కరిం చారు. అధ్యాపకులు తమ బోధనా పద్ధతులలో చేసుకోవాల్సిన మార్పులు, స్వీయ అంచనా ఆవశ్యకతను ఆయన నొక్కి చెబుతూ.. ఈ కార్యశాలను సద్విని యోగం చేసుకో వాలని సూచించారు. ఆంగ్ల విభాగం అసోసి యేట్ ప్రొఫెసర్లు డాక్టర్ అమిత్ కుమార్, డాక్టర్ రూత్ జర్లోనూని హౌజెల ల సమన్వయంతో సాగిన ఈ కార్యశాల, అధ్యాపకుల వికాసానికి, విద్యా పద్ధతులను మెరుగుపరచుకోవడానికి, వృత్తిపర అభివృద్ధికి ఎంతగానో తోడ్పడింది.

గీతమ్‌లో ఘనంగా ఓనం ఉత్సవాలు

కేరళ వార్షిక పంటల, సాంస్కృతిక పండుగ ఓనంకు గురువారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్‌లోని డైరెక్టరేట్ ఆఫ్ స్టూడెంట్ లైఫ్ వారు ఘనంగా నిర్వహిం చారు. ఈ వేడుకలలో భాగంగా గీతం విద్యార్థులకు సెంట్రల్ లాన్‌లో సంప్రదాయ ఆటలు, శివాజీ ఆడిటోరి యంలో సాంస్కృతిక ప్రదర్శనలతో పాటు వివిధ కార్యక్ర మాలు: నిర్వహించారు. అందంగా అలంకరించిన పూల రంగోలి, శక్తివంతమైన కేరళ డ్రమ్ ప్రదర్శన (చెండా మేళం) లకు ఆకట్టుకునే సాంస్కృతిక ప్రదర్శనలు తోడై ఉత్సావా లకు మరింత శోభనిచ్చాయి, ఈ సందర్భంగా గీతం కేఫ్‌లో పాయసం, ఇతర సంప్రదాయ కేరళ వంటకాలతో కూడిన ఓనం నేపథ్యంతో కూడిన ప్రత్యేక విందును కూడా ఏర్పాటు చేశారు.విద్యార్థులు కేరళ సంప్రదాయ వస్త్రధారణలో ఉత్సాహంగా ఆయా వేడుకలలో పాల్గొని, ఇదో మరుపురాని రోజుగా చేశారు. ఈ కార్యక్రమం పలు నేపథ్యాల నుంచి వచ్చిన విద్యార్థులందరినీ ఒకచోట చేర్చి వారిలో ఐక్యతను పెంపొందించడంతో పాటు సాంస్కృతిక నైపుణ్యాలకు పదును పెట్టింది అనడంలో అతిశయోక్తి లేదు.

హైడ్రా పేరుతో 5 లక్షలు డిమాండ్

నకిలీ రిపోర్టంను అరెస్ట్ చేసిన పోలీసులు

నవతెలంగాణ-అమీన్‌పూర్



హైడ్రా పేరుతో రూ.5 లక్షలు డిమాండ్ చేసిన నకిలీ రిపోర్టర్‌ను అరెస్ట్ చేసి రిమాండుకు పంపినట్టు జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ తెలిపారు. ఈ సందం ర్భంగా ఎస్పీ మాట్లా డుతూ.. అమీన్‌పూర్ మండలం లోని బీరంగూడలో గల జయలక్ష్మినగర్‌కు చెందిన జన్వాడే రవి.. సీబీఆర్ కాలనీలో ప్లాటు ఖరీదు చేసి, గతంల లోనే జీ ప్లస్2 ఇంటి నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం రెండో అంతస్తు పనులు చేస్తుండగా.. రామచంద్రపురం సాయిన గర్‌కాలనీకి చెందిన దగుడు రాము రిపోర్టర్ అనే పేరుతో.. జన్వాడే రవి బిల్డింగ్ వద్దకు వచ్చి, తన బిల్డింగ్ ప్రభుత్వ స్థలంలో నిర్మించావని, ఆ నిర్మా ణానికి జీ ప్లస్-2 వరకు మాత్రమే అనుమతులు ఉన్నా యని, అక్రమంగా నిర్మాణం చేపడుతున్నారని భయభ్రాంతు లకు గురి చేశాడు. తాను ప్రతీరోజు తహసిల్దార్, ఆర్డీవోలతో ఫోన్‌లో మాట్లాడుతానని..హైడ్రా కమిషనర్ రంగ నాథ్ తనకు బాగా తెలుసునని భయభ్రాం తులకు గురి చేశాడు. ఆ నిర్మాణ పనులు నిలిపివేయాలని, అలా చేయకుండా ఉండా లంటే తనకు రూ.5 లక్షలు ఇవ్వాల ని, లేదం టే బిల్డింగ్ గురించి తన పత్రికల్లో రాసి బిలి ంగ్ కూల్చి వేయిస్తానని బెదిరించాడు. తనకు పాతబస్తీకి చెందిన చాలామంది పహిల్వాన్లు తెలుసు నని, డబ్బులు ఇవ్వకపోతే అంతు చూస్తానని బెదిరిం పులకు పాల్పడ్డాడు. దాంతో జన్వాడ రవి పోలీసులకు ఫిర్యాదు చేయ ంగా.. కేసు నమోదు చేసిన అమీన్‌పూర్ నింది తుడు రాము ను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. ఎవరైనా హైడ్రా పేరుతో, బెదిరింపులకు పాల్పడితే ఆ వ్యక్తు ల గురించిన సమాచారాన్ని నేరుగా తన నెంబర్ 8712656777కు ఫోన్, వాట్సాప్ ద్వారా గాని సమా చారం అందించాలని.. వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు.

బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలి

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

మిషన్ భగీరథ కార్మికులకు పది నెల్లుగా జీతాలు ఇవ్వడం లేదని వారంలో వేతనాలు చెల్లించకపోతే నీటి సరఫరా ను బంద్ చేస్తామని సీఐటీయూ జిల్లా కార్య దర్శి జి.సాయిలు అన్నారు. ఎస్ఈ ఆఫీసు ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిసా ్తమన్నారు. ఈ సందర్భంగా జి.సాయిలు మాట్లాడుతూ.. మిషన్ భగీరథలోని జీకేఆర్ సంస్థలో పనిచేస్తున్న 200 మంది కార్మికులకు 10 నెలల నుంచి వేతనాలు అందగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని.. వెంటనే బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. రాత్రింబవళ్లు కష్టపడుతూ ప్రజలకు నీటిని సరఫరా చేస్తున్నా.. నేటికీ కనీస వేతనం లేదన్నారు. ప్రభుత్వపరంగా నెలకు ఒక్కొక్క కార్మికునికి ప్రభుత్వం పదారువేలు చెల్లిస్తే కాంట్రాక్టర్ కేవలం రూ.9,500 నెలకు చెల్లిస్తూ శ్రమ దోపి డీకి పాల్పడుతున్నారన్నారు. చట్టపరమైన ఈఎస్ఐ, పీఎఫ్ ఏదీకూడా అమలు కావడం లేదన్నారు. వెంటనే కాంట్రాక్టర్ పై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. వేతనాల కోసం కాంట్రాక్టర్‌ను కార్మికులు అడిగితే బెదిరిస్తున్నారన్నారు.



ఇప్పటికైనా ఆ కార్మికులకు కనీస వేతనం అమలు చేయా లని.. చట్టపరమైన సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. వారం రోజుల్లో వేతనాలు చెల్లించకుంటే నీటిని సరఫరా బంద్ చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమ ంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.యాదగిరి, కార్మికులు నర్సింలు, లక్ష్మణ్, లింగం, రియాజ్, సదానందం, రాములు, యాదయ్య శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఈఈ విజయలక్ష్మి, ఎస్ఈ ఆఫీసులోని ఏఈ లక్ష్మీకి వినతిపత్రం అందజేశారు.

చెరువు కట్ట మరమ్మత్తులు వెంటనే ప్రారంభించాలి

కట్ట తెగి నాలుగు రోజులైనా అధికారుల్లో చలనం లేదు

చెరువు కింద నష్టపోయిన 10 ఎకరాలకు నష్టపరిహారం చెల్లించాలి.

తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేసిన వ్యవసాయ కార్మిక సంఘం



నవతెలంగాణ-పుల్కల్

మండలంలోని ముది మాణిక్యం గ్రామంలోనే నాగుల చెరువు కట్ట తెగిపోయిందని, వెంటనే మరమ్మత్తులు చేపట్టాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.నర్సిములు డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం బృందం గురువారం పెద్ద చెరువు ను పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నర్సిములు మాట్లాడుతూ.. ముది మాణిక్యం గ్రామంలో నాగుల చెరువు పెద్దదని, ఈ చెరువు కింద సుమారుగా 200 ఎకరాల భూములు పంటలు పండుతాయన్నారు. గత పది రోజులుగా అకాల వర్షాలు కురవడంతో చెరువు కట్ట మధ్యలో తెగిపోవడంతో 200 ఎకరాలు ఎండిపోయే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. చెరువు కట్ట మధ్యన తెగిపోవడంతో నీటి ఉధృతికి కింద ఉన్న 10,15 ఎకరాల్లో పంటలు నష్టపోయాయన్నారు. ఆ రైతులను వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. చెరువు కట్ట ముందుగా బుంగలు రావడంతో అధికారులు స్పందించకపోవడం వలన చెరువు కట్ట తెగిపోయిందన్నారు. కట్ట తెగి నాలుగు రోజులైనా అధికారుల్లో స్పందన లేదన్నారు. అధికారులు వెంటనే స్పందించి చెరువు కట్ట మరమ్మత్తును చేపట్టాలన్నారు. అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని లేనియెడల పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు టీ.ఏ శోభ,మండల నాయకులు రాములు తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఖాళీ చేయాలి

నిర్వాసితులకు ఆర్డీఓ సూచన

నవతెలంగాణ- గజ్వేల్

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో సంగాపూర్ వద్ద ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను మల్లన్న సాగర్ నిర్వాసితులు ఖాళీ చేయాలని గజ్వేల్ ఆర్డీవో బన్సీలాల్ అన్నారు. గురువారం ఆర్డీఓ కార్యాలయంలో వివిధ గ్రామాలకు చెందిన నిర్వాసితులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గజ్వేల్ పట్టణంలో నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను కేటాయించినట్లు ఆయన నిర్వాసితులకు వివరించారు. మల్లన్న సాగర్ పరిధిలోని నిర్వాసితులకు ప్లాట్లు, ప్యాకేజీ అందించామని అయితే కొందరికి కొన్ని కారణాలవల్ల అందలేదని తమ దృష్టికి వచ్చిందని ఆయన పేర్కొన్నారు. నిర్వాసితులకు న్యాయం చేసేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకపోతానని తెలిపారు. అయితే నిర్వాసితులు ఉంటున్న ఇండ్లను వెంటనే ఖాళీ చేస్తే నిరుపేదలకు అందిస్తామని ఆయన చెప్పారు.



నిర్వాసితుల డిమాండ్.

తమకు పూర్తిప్యాకేజీ, ప్లాట్లు వచ్చేవరకు ఇండ్లు ఖాళీ చేసేది లేదని నిర్వాసితులు ఆర్డీవోకు తెలిపినట్లు నిర్వాసితులు పేర్కొన్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి సమస్య పరిష్కరించాలని కోరినట్లు తెలిపారు. అనేక మందికి ప్లాట్లు అదేవిధంగా ప్యాకేజీ రాలేదని సమస్యలు అనేకం ఉన్నాయని నిర్వాసితులు తెలిపారు. తమ డిమాండ్లను పరిష్కరించిన తర్వాతనే ఇండ్లు ఖాళీ చేస్తామని చెప్పారు.

ప్రయివేటు ఆసుపత్రుల రికార్డులు పరిశీలన

నవతెలంగాణ-సంగారెడ్డి

స్టేట్ క్లినికల్ ఎస్టాబ్లెస్మెంట్ యాక్ట్ టాస్క్‌ఫోర్స్ కమిటీ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పుష్పవాణి, ప్రోగ్రాం స్పెషల్ ఆఫీస ర్ డాక్టర్ రవితేజ ఆధ్వర్యంలో శ్రీ చరిత, మంజీరా, వినోద్, శిశురక్ష ఆసుపత్రులను గురువారం తనిఖీ చేసి.. వివిధ రికార్డులను పరిశీలించారు. వాటికి సంబంధించిన కాపీలను తీసుకు వెళ్లారు. వాటిని పరిశీలించి నివేదికను డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్‌కి అందజేసిన తర్వాత ఏవైనా లోపాలు ఉంటే.. తగు చర్యల కోసం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి పంపిస్తామన్నారు. ఈ కాగా హాస్పి టల్‌లో వివిధ శాఖల అనుమతి పత్రాలను పరిశీలించారు. వారు అందిస్తున్న చికిత్స సేవలను.. వారు వసూలు చేస్తున్న ఛార్జీలను, వాటికి సంబంధించిన బిల్స్, కేస్ సీట్లను పరిశీలి ంచి.. వారు హాస్పటల్లో ప్రదర్శించిన ధరల పట్టికలతో పోల్చి చూశారు. ఆ హాస్పిటల్లో ఫైర్‌సేఫ్టీ విధానాల్ని బయో మెడి



కల్ వేస్ట్ డిస్పోజల్, హాస్పిటల్లో పనిచేస్తున్న సిబ్బంది వివర ాలు.. వారి సర్టిఫికెట్లు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ జి.గాయత్రీ దేవి, ఆరోగ్య శాఖ అధికారి శ్రీ ప్రసాద్, మాస్ మీడియా ఆఫీసర్ వి. రవి, సీనియర్ అసిస్టెంట్, స్టేట్ క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ టాస్క్ ఫోర్ కమిటీ మెంబర్స్ సునీల్ రాజ్, సిహెచ్ఓ, రమావాని, డిఎస్ఓ అనిల్ కుమార్, వెంకట్ రామ్ రెడ్డి, నిరంజన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జీ పై నుంచి కిందపడబోయిన కార్మికుల బస్సు

బ్రిడ్జీ చివరన వేలాడగా.. జేసీబీల సాయంతో వెనక్కి లాగిన స్థానికులు

తృటిలో తప్పిన ఘోర ప్రమాదం

నవతెలంగాణ-జహీరాబాద్

కార్మికులతో వెళ్తున్న ఓ కంపెనీ బస్సు బ్రిడ్జీపై నుంచి కిందపడబోయింది. బ్రిడ్జీకి చివరన వేలాడుతూ అక్కడే ఆగ డంతో అందులోని కార్మికులు ఊపిరిపీల్చుకున్నారు. జహీరాబాద్ ఎస్ఐ కాశీనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం రోజున జహీరాబాద్‌లో పట్టణంలోని రాంనగర్ నుంచి కార్మికులను ఎక్కించుకుని ఓ బస్సు కంపెనీకి బయ ల్దేరింది. అయితే డ్రైవర్ అజాగ్రత్తగా నడపడంతో మల్చల్మ వెళ్లే రైల్వే ఓవర్ బ్రిడ్జిపై నుంచి బస్సు కిందపడబోయింది. బ్రిడ్జీ చివరన వేలాడుతూ ఆగిపోవడంతో కార్మికులంతా ఒక్క సారిగా భయాందోళనకు గురయ్యారు. బస్సులోని కార్మికులు రోదనలు.. హార్తనాథాలు చేశారు. స్థానికులు ఇసుక అడ్డపై ఉన్న జేసీబీలను తీసుకువచ్చి.. ఆ బస్సును వెనక్కి లాగి కార్మికులందరినీ కాపాడారు. కాగా క్షతగాత్రులు ఎవరూ కూడా ఫిర్యాదు చేయకపోవడంతో.. కేసు నమోదు చేయలేదని ఎస్ఐ తెలిపారు. డ్రైవర్లు జాగ్రత్తలు. సూచనలు పాటించకపోతే ఇలాంటి ఘటనలే చోటుచేసుకుంటా యన్నారు. కాబట్ట ప్రతీ ఒక్కరూ వాహనాలు నడిపేటప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు.



తుర్కవాడగామాలో పారిశుధ్య పనులు

నవతెలంగాణ-కంగ్టి



మండలంలోని తుర్కవడగామాలో ఎంపీడీఓ సత్యయ్య ఆధ్వర్యంలో గురువారం పారిశుధ్య పనులు నిర్వహించారు. మురికి కాల్వలు శుభ్రం చేసి.. విధుల గుండా రోడ్డుకు ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలను కార్మికులు తొలిగించారు. ఈసందర్భంగా ఎంపిడీఓ మాట్లాడుతూ.. గత వారంరోజులు ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షానికి మురికి కాలువలు నిండిపోయి, రోడ్డుకు ఇరువైపులా చెట్లు, పిచ్చి మొక్కలు పెరిగి ఈగలు, దోమలు పెరిగిపోయి ప్రజలు రోగాలబారిన పడుతున్నారన్నారు. అందుకే పరిశుభ్రతా కార్యక్రమాలను చేపట్టినటు చెప్పారు. ప్రజలు కూడ పరిశుభ్రత పాటించాలని, ఇంటి చుట్టుపక్కల పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. తడి, పొడి చెత్తలను వేరుచేసి పంచాయతీ చెత్తబండిలో మాత్రమూ వేయాలన్నారు. మండలంలో ప్రస్తుతం డెంగ్యూ మలేరియా వంటి రోగాలు ప్రభలుతున్నాయని.. ప్రజలు శుభ్రత పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలన్నారు.

రాఘవాపూర్‌ను సందర్శించిన ఎంపీడీఓ

స్పందన

నవతెలంగాణ-న్యాల్‌కల్



'సమస్యల వలయంలో రాఘవపూర్' అనే శీర్షికన రెండ్రోజుల క్రితం నవతెలంగాణ పత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. జిల్లా కలెక్టర్, డీపీఓ ఆదేశాల తో ఎంపీడీవో రాజశేఖర్ గురువారం రోజున పంచాయతీ అధికారులతో కలిసి రాఘవా పూర్ గ్రామాన్ని సందర్శించారు. డంపింగ్ యార్డ్, స్మశానవాటికకు వెళ్లే దారికి సంబంధించి ఇబ్బందులు తొలగించేందుకు పరిశీలించారు. డంపింగ్ యార్డ్ దారి కోసం రోడ్డు వంతెన అవసరం ఉందని ఎంపీడీవో తెలిపారు. ఇందుకు సంబంధించి జిల్లా ఉన్నతాధికారులకు ప్రత్యేక నిధుల కోసం నివేదికను పంపుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ సురేష్, పంచాయతీ కార్యదర్శి వాణి, గ్రామ నాయకులు రాములు సెట్, సిబ్బంది ఉన్నారు.

నేలరాలిన ఎర్రమందారం

- అనారోగ్యంతో సీపీఐ(ఎం) అఖిల భారత ప్రధాన కార్యదర్శి సీతారం ఏచూరి మృతి
- ఆయన మరణం దేశ రాజకీయాలకే తీరని లోటు
- సీపీఐ(ఎం), సీఐటీయూ ఆధ్వర్యంలో విప్లవ జోహార్లు

నవతెలంగాణ-సంగారెడ్డి

మార్క్సిస్టు మహాయోధుడు, సీపీఐ(ఎం) అఖిల భారత ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అనారోగ్యంతో మృతి చెందడం బాధాకరమని.. ఓ ఎర్రమందారం నేలరాలిందని సీపీఐ(ఎం), సీఐటీయూ నాయకులు అన్నారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న సీతారం ఏచూరి గురువారం రోజున ఢిల్లీలోని ఎయిమ్స్ ఆసుపత్రిలో మృతి చెందాడు. దాంతో సంగారెడ్డిలోని సీపీఐ(ఎం) కార్యాలయం వద్ద పార్టీ జెండాను అవనతం చేశారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయ రాజు మాట్లాడుతూ.. కామ్రేడ్ సీతారాం ఏచూరి విద్యార్థి దశ నుంచి చనిపోయే వరకు వామపక్ష భావాలతోనే నడిచారన్నారు. గత 4 దశాబ్దాలుగా భారత కమ్యూనిస్టు రాజకీయాల్లో చెరగని ముద్రను వేశారన్నారు. ప్రజాఉద్యమాల్లో, పార్లమెంటరీ ఉద్యమాల్లో ఆయనెప్పుడూ ప్రజల పక్షమే వహించారన్నారు. కార్మిక, కర్షక ఉద్యమాల వానిని వినిపించి అనేక సార్లు ఉత్తమ పార్లమెంటేరియన్‌గా నిలిచారన్నారు. పేద ప్రజల ఐక్యత కోసం,కుల, మత వైశ్యామ్యాలు లేని భారత సమాజం కోసం కృషి చేశారన్నారు. ఆయన మృతి సీపీఐ(ఎం) పార్టీకి, భారత ప్రజానీకానికి, కమ్యూనిస్టు ఉద్యమానికి తీరనిలోటు అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లాకార్యదర్శివర్గ సభ్యులుసాయిలు, జిల్లాకమిటీ సభ్యులు యాదగిరి, నర్సింహులు, లక్ష్మి నాయకులు అశోక్, రాజయ్య కృష్ణ, బాలరాజు, రమేష్ గౌడ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పటాన్‌చెరు : మండలంలోని పాశమైలారం పారిశ్రామిక వాడలో గల పార్లే ఆగ్రో పరిశ్రమలో సంతాప సభ ఏర్పాటు







చేసి.. సీతారం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు కే.రాజయ్య మాట్లాడుతూ.. దేశ రాజకీయాల్లో ఒక ఆదర్శ నేతను కోల్పోయామన్నారు. నిత్యం ప్రజల కోసమే పరితపించి.. సిద్ధాంతం కోసం నిలబడిన మహోన్నతమైన వ్యక్తి అని కొనియాడారు. విద్యార్థి దశనుంచే పోరాటాలలో పాల్గొన్న సిద్ధాంత మేధావి గని అని అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జనరల్ సెక్రెటరీ సంతోష్ కుమార్ గౌడ్, రాజశేఖర్, సుజిత్, కిరణ్, రాజు, శ్రీకాంత్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నారాయణఖేడ్‌రూరల్ : స్థానిక సీఐటీయూ కార్యాలయంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి విప్లవ జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు అతిమేల మాణిక్ మాట్లాడుతూ.. కామ్రేడ్ సీతారాం ఏచూరి మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటు అని అన్నార. భారతదేశ ఎర్ర సూర్యుడు అని కొనియాడారు. ఉన్నత కుటుంబంలో పుట్టినా.. కమ్యూనిస్టు ఉద్యమాల వైపు ఆకర్షితులై విద్యార్థి దశనుండే పోరాట బాట పట్టారన్నారు. ఎమర్జెన్సీని వ్యతిరేకిస్తూ జెఎన్యు విద్యార్థి అధ్యక్షుడిగా ఉద్యమం నిర్వహించి అప్పటి ప్రధానమంత్రి ఇందిరా గాంధీతో రాజీనామా చేయించారన్నారు. దేశంలో లౌకిక శక్తులు ఏకంచేసి యూపీఏ ప్రభుత్వం ఏర్పాటులో కీలక భూమిక పోషించారన్నారు. ఉపాధిహామీ చట్టం, సమాచార హక్కుచట్టం, అటవీ హక్కులచట్టం లాంటి కీలక చట్టాలు తేవడంలో ముఖ్య భూమిక పోషించారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నారాయణఖేడ్ ఏరియా కమిటీ ఇంచార్జ్ నల్లవల్లి రమేష్, నాయకులు అరుణ్, సతీష్, డీవైఎఫ్ఐ నాయకులు మైపాల్, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు సంతోష్, అంబేద్కర్ సంఘం డివిజన్ అధ్యక్షులు కాన్సిరాం, ప్రజా సంఘాల నాయకులు చంద్రకాంత్, జైపాల్ పాల్గొన్నారు.

నూతన ఎంపీడీవోను సన్మానించిన ఫీల్డ్ అసిస్టెంట్లు

నవతెలంగాణ-న్యాల్‌కల్



న్యాల్కల్ నూతన ఎంపీడీవోగా ఇటీవలే బాధ్యతలు చేపట్టిన రాజశేఖర్‌ను మండల ఫీల్డ్ అసిస్టెంట్ సంఘం ఆధ్వర్యంలో గురువారం శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. విధుల్లో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదన్నారు. ఈ సన్మాన కార్యక్రమంలో ఏపీఓ రంగారావు, ఫీల్డ్ అసిస్టెంట్ సంఘం అధ్యక్షుడు మామిడిగి జగనాథ్ రెడ్డి, అబ్బాస్, సంగప్ప, బీరప్ప, సిబ్బంది తదితరులున్నారు.

రేషన్ డీలర్లు, వార్డ్ ఆఫీసర్లతో కమిషనర్ సమావేశం



నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

బొల్లారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపాల్టీ పరిధిలో పనిచేస్తున్న రేషన్ డీలర్లు, వార్డ్ ఆఫీసర్లతో కమిషనర్ మంగతాయారు ఆధ్వర్యంలో గురువారం సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం.. లబ్దిదారులకు ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ, లబ్ది గురించి వివరించారు. ప్రభుత్వం అందించిన సందేశం పత్రాలని ప్రతీ లబ్దిదారునికి చేరవేయాలన్నారు. డీలర్లు, వార్డ్ ఆఫీసర్లు సమన్వయంతో అట్టి రూ. 500లకే ఎల్పీజీ సిలిండర్ల పొందే బెనిఫిట్ విషయం లబ్దిదారులకు అర్థమయ్యే విధంగా వివరిస్తూ ప్రభుత్వం ఇచ్చిన సందేశం పత్రాన్ని నాలుగు రోజుల్లో కల అందరికీ చేరవేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్, నిర్మలారెడ్డి, రెవెన్యూ ఆఫీసర్ టీ నర్సింలు, డీలర్లు, వార్డ్ ఆఫీసర్లు సత్యనారాయణ, దుర్గాప్రసాద్, మల్లేష్, విజయ్ కుమార్, దినేష్, వినోద్, పాండు, ఈశ్వరమ్మ, అనిత, ఎలీషా, అశ్విని , సునీత తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన తపస్ సభ్యత్వ నమోదు

నవతెలంగాణ-న్యాల్‌కల్



మండలంలోని మిర్జాపూర్ (బి), హద్నూర్, న్యాల్‌కల్ కేజీవీబీ, చీకుర్తి, వడ్డీ, మామిడ్గి ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) ఆధ్వర్యంలో మొదటి రోజు సభ్యత్వ నమోదు ప్రారంభమైంది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి తపస్ సంఘం పనిచేస్తుందన్నారు. ఉపాధ్యాయులు సభ్యత్వానికి చొరవ చూపుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి తుకారం, మండల అధ్యక్షులు శేఖర్, ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్, ఉపాధ్యాయులు సంజీయు, రాజు నాయక్, శ్రీకాంత్, కృష్ణ, బాలకృష్ణ, తదితరులున్నారు.



ఆసుపత్రి నుంచి యువతీ అదృశ్యం

నవతెలంగాణ-సంగారెడ్డి

బంధువులను చూడడానికి సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తల్లిదండ్రులతో కలిసి వచ్చిన ఓ యువతీ అదృశ్యమైంది. సంగారెడ్డి ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం..

రామచంద్రాపురం రైల్వేకట్టకు చెందిన పొలిమేర రాజు, సుశీల దంపతులు వారి కూతురు ప్రణిత(14 ఏండ్లు)తో కలిసి సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారి బంధువులను చూడటానికి ఈనెల 10న వచ్చారు. సాయంత్రం అందజ 5.00 గంటలకు అందరూ కలిసి దవాఖానలో భోజనం చేశారు. ప్రణిత చేతులు కడుక్కోవడానికి దవాఖాన బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దాంతో వారి తల్లిదండ్రులు దవాఖాన చుట్టూ, వివిధ చోట్ల వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దాంతో బుధవారం పోలీస్ స్టేషన్‌కి వచ్చి దరఖాస్తు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ అమ్మాయికి మతిస్థిమితం సరిగ్గా లేదని.. ఎవరికైనా కనిపిస్తే సంగారెడ్డి టౌన్ పోలీస్ స్టేషన్ 08455-276333, ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్‌కు 8712656718ద్వారా సమాచారం ఇవ్వాలన్నారు.

శాంతియుతంగా నిమజ్జనాలు జరపాలి

నవతెలంగాణ-న్యాల్‌కల్



వినాయక నిమజ్జనాలు శాంతియుతంగా జరపాలనిహద్నూర్ ఎస్సై రాము నాయుడు అన్నారు. రేజింతల్ గ్రామంలో ఛత్రపతి శివాజీ సేన యూత్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుని మండపంలో గురువారం జరిగిన పూజా కార్యక్రమంలో ఎస్సై స్థానిక నాయకులతో కలిసి పాల్గొన్నారు. గణనాథుడికి పూజలు చేసి హారతి సమర్పించారు. అనంతరం ఎస్ఐని, స్థానిక నాయకులను కమిటీ సభ్యులు శాలువా పూలమాలతో ఘన సన్మానించారు.

అంత్యక్రియలకు రూ.10 వేల ఆర్థిక సాయం



నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

బొల్లారం మున్సిపల్ పరిధిలోని జ్యోతినగర్‌లో నివసిస్తున్న ఒడిశా రాష్ట్రానికి చెందిన తుఫాన్ నాయక్(24) గుండె నొప్పితో బుధవారం మధ్యరాత్రి మృతి చెందాడు. కాగా పొట్టచేత పట్టుకుని బతుకుదెరువు కోసం ఇక్కడికి వచ్చామని.. తమను ఆదుకోవాలని మృతుని సోదరుడు దీపక్ నాయక్.. కేజేఆర్ ఆనంద్ కృష్ణారెడ్డికి విజ్ఞప్తి చేశాడు. దాంతో ఆయన వెంటనే స్పందించి.. తనవంతుగా అంత్యక్రియల కోసం పదివేల రూపాయల సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆనంద్ కృష్ణారెడ్డ మాట్లాడుతూ.. ఒక మనిషిగా మరో మనిషికి కష్టాల్లో ఉన్నప్పుడు ఆదుకోవడం తన భాధ్యత అన్నారు.

స్వామి వివేకానంద యూత్ ఆధ్వర్యంలో అన్నదానం

నవతెలంగాణ-పుల్కల్



మండల కేంద్రమైన పుల్కల్లో స్వామి వివేకానంద యూత్ సభ్యులు ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద గురువారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అన్ని రాజకీయ పార్టీల నాయకుల, ప్రజలు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు తీసుకున్నారు. ఇంత పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసిన స్వామి వివేకానంద యూత్ సభ్యులను గ్రామస్తులు అభినందించారు.

రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం

నవతెలంగాణ-సంగారెడ్డి



బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజి రెడ్డి సూచనలతో జిల్లా శాఖ ఆధ్వర్యంలో సంగారెడ్డి పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి కొలుకూరి రాజశేఖర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు పోచా రం రాములు మాట్లాడు తూ.. రాహుల్ గాంధీ విదేశాలకు వెళ్లి భారతదేశ ప్రతిష్టను దెబ్బతీసే విధంగా ఆర్థిక వ్యవస్థను, ప్రజాస్వామ్యాన్ని అవహేళన చేస్తూ మాట్లాడడం శోచనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అనంతరావు కులకర్ణి, జిల్లా ఉపాధ్యక్షులు ప్రభాకర్ గౌడ్, కౌన్సిలర్లు మందుల నాగరాజు, కసిని వాసు, ద్వారకా రవి, జిల్లా కార్యాలయ కార్యదర్శి దోమల విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నవసమాజ నిర్మాతలు ఉపాధ్యాయులు

- పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- ఘనంగా ప్రభుత్వ పాఠశాలల గురుపూజోత్సవ వేడుకలు

నవతెలంగాణ-పటాన్‌చెరు



నవసమాజ నిర్మాతలు ఉపాధ్యాయులని, భావి భారత పౌరులను తయారు చేయాల్సిన గురుతర బాధ్యత వారిపై ఉందని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్‌చెరు పరిధిలోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్లో గురువారం ఏర్పాటు చేసిన నియోజక వర్గస్థాయి ప్రభుత్వ పాఠశాల గురుపూజోత్సవ వేడుకలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలోని విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయన్నారు. గత 25ఏండ్లుగా ప్రతిఏటా గురుపూజోత్సవ కార్యక్రమం ఏర్పాటు చేసి, ఉత్తమ గురువులను సన్మానించడం సంతోషకరంగా ఉందన్నారు. విద్యార్థులకు చదువుతోపాటు నైతిక విలువలు బోధించాలని, ప్రతి విద్యార్థికి క్రీడల పై ఆసక్తి పెంపొందించేలా కార్యక్రమాలు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. పటాన్ చెరు నియోజకవర్గంలోని ప్రతి పాఠశాలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దడం జరిగిందని తెలిపారు. విద్యారంగాన్ని బలోపేతం చేయడంతో పాటు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ గురుకులాలు, రెసిడెన్షియల్ కళాశాలలో, మోడల్ స్కూల్స్ ఏర్పాటు చేసి బడుగు బలహీన విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందిస్తున్నట్టు చెపారు. అనంతరం పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల పరిధిలో విధులు నిర్వహిస్తున్న 75 మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు మాట్లాడుతూ.. గత 25ఏండ్లుగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి నేతృత్వంలో గురుపూజోత్సవ వేడుకలు నిర్వహించడం అభినందనీయ మన్నారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల విద్యార్థిని విద్యార్థులు ప్రదర్శించబడిన సాంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ అలరించాయి. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారులు పీపీ రాథోడ్, జెమిని కుమారి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు నరసింహారెడ్డి, వివిధ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాగునీరు, రోడ్ల సమస్యలపై వాడీవేడి చర్చా..



నవతెలంగాణ-ఐడిఎ బొల్లారం

బొల్లారం మున్సిపల్ తాత్కాలిక కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన సాధారణ సర్వసభ్య సమావేశంలో తాగునీటి, రోడ్ల సమస్యలపై వాడీవేడీ చర్చ జరిగింది. ఉదయం 11 గంటలకు మున్సిపల్ చైర్‌పర్సన్ రోజా బాల్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో పలు సమస్యలపై విస్తృత చర్చ సాగింది. ముందుగా అన్ని వార్డుల్లో రూ.6 కోట్ల 80 లక్షల అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. దానిలో ప్రతీ వార్డుకు రూ.30 లక్షల చొప్పున కేటాయింపులు చేశారు. అనంతరం సభ ప్రారంభం కాగానే పలువురు సభ్యులు తమ వార్డులలో నెలకొన్న సమస్యలపై వాడివేడిగా చర్చించారు. 15వ వార్డులో కుక్కలు, పందుల బెడదతో ప్రజలు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కౌన్సిలర్ సంతోషా లక్ష్మారెడ్డి సభ దృష్టికి తీసుకువచ్చారు. అదేవిధంగా కౌన్సిలర్ గోపాలమ్మ రెండో వార్డులో నెలకొన్న సమస్యలను ప్రతి సమావేశంలో మాట్లాడినా.. పరిష్కారం దొరకట్లేదన్నారు. మిషన్ భగీరథ పైప్లైన్ నిర్మాణంతో రోడ్లు అస్తవ్యస్తంగా తయారయ్యాయని కౌన్సిలర్ హనుమంత్ రెడ్డి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరికొందరు రోడ్ల, మంచినీటి సరఫరా వంటి అంశాలపై అధికారు లను నిలదీశారు. 48 గంటల్లో అన్ని వార్డుల్లో పారిశుద్ధ్య సమస్యలను పరిష్కరించాలని వైస్ చైర్మన్ అనిల్ కుమార్ రెడ్డి సభలో చర్చించారు. అదేవిధంగా ఇండస్ట్రియల్ ప్రతినిధులు ట్యాక్స్‌లు సకాలంలో కడుతున్నట్టు.. తమ సమస్యలను పరిష్కరించాలని తన దృష్టికి తీసుకువచ్చిన విషయాన్ని వైస్ చైర్మెన్ సభలో చర్చించారు. స్మశాన వాటిక, రోడ్ల అభివృద్ధి పనుల కోసం ప్రతిపాదనలు తయారు చేసే టెండర్లను పూర్తి చేయాలని చైర్‌పర్సన్ అధికారులను ఆదేశించారు. అందరి సహకారంతోనే మున్సిపాల్టీ అభివృద్ధి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కమిషనర్ మంగతాయారు, మున్సిపల్ మేనేజర్ నిర్మల, ఆర్వో నర్సింలు, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరామర్శకు వచ్చి పాలిటిక్స్ మాట్లాడడం సరికాదు

నవతెలంగాణ-గుమ్మడిదల



గాయపడిన వ్యక్తిని పరామర్శించడానికి వచ్చిన సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు.. అక్కడ కూడా పాలిటిక్స్ మాట్లాడడం సరికాదని టీపీసీసీ సభ్యులు కొత్తపల్లి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖమ్మంలో జరిగిన ఘటనలో గాయపడిన గుమ్మడిదల మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన తన అనుచరుడిని పరామర్శించడానికి వచ్చిన ఎమ్మెల్యే హరీశ్‌రావు.. కాంగ్రెస్ నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం దుర్మార్గమన్నారు. కార్యకర్తలను 'కాంగ్రెస్ పార్టీ గుండాలు' అని అన్నాడని.. ఆ మాటలను ఉపసంహరించుకోవాలనారు. పరామర్శకు వచ్చినప్పుడు.. బాధిత కుటుంబానికి ధైర్యం చెబితే బాగుండేదన్నారు. కాంగ్రెస్ నాయకులపై చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాల న్నారు. బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షులు దాసరి శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. మహిళలంటే చిన్నచూపు చూసే నాయకుల వారి మాతృమూర్తులు మహిళలే అని గమనించి మాట్లాడాలని.. చీరే గాజులు చూపించి దిగజారుడు రాజకీయాలు మానుకోకపోతే వారి నియోజకవర్గ మహిళలే తగిన గుణపాఠం చెప్తారన్నారు.కార్యక్రమంలో జిన్నారం మాజీ ఎంపీపీ డి.రవీందర్ గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పుట్ట నర్సింగరావు, వడ్డే కృష్ణ, మాజీ మండలాధ్యక్షులు మద్ది వీరారెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ గౌడ్, నాయకులు మద్ది ప్రతాప్ రెడ్డి, గోవర్ధన్ గౌడ్, ఎం నరేందర్‌రెడ్డి, విజ యకుమార్, కృష్ణగౌడ్, లింగయ్యగారి నరేందర్‌రెడ్డి, ఇప్ప రాంరెడ్డి, అంజద్‌ఖాన్, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

17న గ్రామాల్లో ప్రజాపాలన కార్యక్రమం

నవతెలంగాణ-న్యాల్‌కల్



ఈనెల 17న గ్రామాల్లో నిర్వహించనున్న ప్రజాపాలన కార్యక్రమంలో అందరూ పాల్గొనేలా కృషి చేయాలని ఎంపీడీవో రాజశేఖర్ అన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించి పంచాయతీ కార్యదర్శులకు, ఈజీఎస్ సిబ్బందికి గురువారం సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో పారిశుధ్యం నిర్లక్ష్యం చేయొద్దని.. వ్యాధులు ప్రబలకుండా పరిశుభ్రత చర్యలు పాటించాలన్నారు. గ్రామాల్లో ఓటర్ లిస్ట్ ప్రకటన చేయాలని.. అభ్యంతర స్వీకరణ చేసేలా కార్యదర్శులకు వివరించారు. ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా చెట్లు నాటడం, జాతీయ పథకావిష్కరణ కార్యక్రమాలు ఉంటాయన్నారు. అలాగే మహాలక్ష్మి సర్టిఫికెట్లు ఆయా గ్రామాల్లో లబ్దిదారులకు పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో తెలిపారు.ఈ సమావేశంలో ఎంపీఓ సురేష్, ఏపీఓ రంగారావు, పంచాయతీ సెక్రెటరీలు ధనరాజ్, చంద్రశేఖర్, సరిన్ తదితరులున్నారు.

అడిషనల్ కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

నవతెలంగాణ-కొండాపూర్



మండల తహసీల్దార్ కార్యాలయలో జిల్లా అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) మాధురి గురువారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. తహసీల్ రికార్డులను పరిశీలించారు. వివిధ అంశాల గురించి స్థానిక తహసీల్దారు అనితను అడిగి తెలుసుకున్నారు. ధరణి ద్వారా జరుగుతున్న రిజిస్ట్రేషన్‌ల గురించి ప్రజల వద్ద ఆరా తీశారు. అనంతరం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు.ఆస్పత్రి కలియతిరిగి.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని వైద్య అధికారులకు సూచించారు. ఆసుపత్రికి వచ్చే వారికి సరైన వైద్యం అందించాలని వైద్యాధికారులకు సూచించారు. తదనంతరం స్థానిక పాఠశాల వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. సరైన భోజనం, వసతి ఉందా లేదా అని అడిగి తెల్సుకున్నారు. కాగా అన్ని వసతులు బాగానే ఉన్నాయని విద్యార్థులు బదులిచ్చారు. పాఠశాల ఆవరణలో ఉన్న బోరు నీటిని వృథాగా కిందపోకుండా చూడాలని హెచ్ఎంకు సూచించారు. అలాగే పాఠశాల ప్రాంగణంలోనే ఉన్న అంగన్వాడి కేంద్రాలను పరిశీలించారు. ఆ సమయంలో చిన్నారులు భోజనం చేస్తుండగా.. భోజన వసతి ఎలా ఉందని చిన్నారులను అడిగారు. అనంతరం గిర్మాపూర్ గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. ఆ సమయంలో హాస్టల్లో భోజనం చేస్తున్న విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాల పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచేట్లు చూడాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. అలాగే మెరుగైన విద్యను బోధించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహసీల్దార్, ఆయా పాఠశాల మరియు ఆస్పత్రికి సంబంధించిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కల్లుగీత కార్మికులకు సేఫ్టీ కిట్స్‌పై అవగాహన



నవతెలంగాణ-చౌటకూర్

జిల్లాలోని వెనుకబడిన తరగతుల అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో కల్లుగీత కార్మికులకు సుల్తాన్‌పూర్ దగ్గర కొర్పోల్ రోడ్డు పక్కన గల తాటివనంలో కాటమయ్య రక్ష సేఫ్టీ కిట్స్‌పై అవగాహనా, శిక్షణా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి ఏ. జగదీష్ మాట్లాడుతూ.. తాటి చెట్టుపై నుంచి పడి చనిపోవడం, దెబ్బలు తాకకుండా నివారణ చర్యల్లో భాగంగా ఈ సేఫ్టీ కిట్స్ ఉపయోగపడతాయన్నారు. వీటి గురించి తాటిచెట్లు ఎక్కేవారందరూ ట్రెనింగ్ తీసుకోవాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ అవగాహన సదస్సుకు సంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ మరియు ప్రొహిబిషన్ శాఖ అసిస్టెంట్ సూపరింటెండెంట్ మణెమ్మ, జోగిపేట సీఐ సాగర్ రెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఆశన్న గౌడ్,ప్రధాన కార్యదర్శి రమేష్ గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ జంగాగౌడ్, వసంత్ గౌడ్,రవీందర్ గౌడ్, విట్టల్ గౌడ్, సుధాకర్‌గౌడ్, గౌడ సంఘ నాయకులు వీరితోపాటు సహాయ వెనుకబడిన తరగతుల శాఖ అధికారి కె.వి అమర్ జ్యోతి,కే.భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించకుండా అధికారులు ఇబ్బందులు

- వారిపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలి
- సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఆర్డీవో ఆఫీస్ ఎదుట ఆందోళన

నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్



ధరణిలో భూ సమస్యలు పరిష్కరించకుండా రెవెన్యూ అధికారులు ప్రజలను ఇబ్బంది పెడుతున్నారని.. వారిపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని, అలాగే ధరణి భూ సమస్యలన్నింటినీ వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో గురువారం ఆర్డీఓ ఆఫీస్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు అతిమేల మానిక్ మాట్లాడుతూ.. ఖేడ్ డివిజన్‌లోని మండలాల్లో భూ సమస్యలు పరిష్కారం కాకుండా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతు న్నారన్నారు. ధరణిలో అప్లై చేసుకోగానే తహసీల్దార్లు వెంటనే రిజెక్ట్ చేస్తున్నార న్నారు. ఏండ్ల తరబడి కార్యాలయాల తిరిగినా.. సాకులు చెబుతూ పరిష్కరించడం లేదన్నారు. కొంతమంది రెవెన్యూ అధికారులు సర్టిఫికెట్ల కోసం బహిరంగంగానే డబ్బులు అడుగుతున్నారని ఆరోపించారు. అవినీతికి పాల్పడుతున్న రెవెన్యూ అధికారులపై విచారణ జరిపి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. నిజాంపేట్ - బీదర్ 161 జాతీయ రహదారిలో భూములు కోల్పోయిన రైతులకు డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. డివిజన్ పరిధిలో ప్రత్యేక భూసమస్యలు పరిష్కరించే విధంగా ఉన్నత అధికారుల బృందంతో రెవెన్యూ సదస్సు నిర్వహించాలని, సంగారెడ్డి డివిజన్లో భూ సమస్యలపై జరుగుతున్న అక్రమాలపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతులను కూడగట్టి పెద్దఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) నారాయణఖేడ్ ఇంచార్జ్ నల్లవల్లి రమేష్, నాయకులు సతీష్, సంతోష్, ప్రజాసంఘాల నాయకులు బస్వరాజు పాటిల్, మైపాల్, చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టంపై అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన

- కనీసం సమాచారం లేదు.. ఫోటోలు దిగి వెళ్లిపోయారు
- రైతుల మండిపాటు..

నవతెలంగాణ-పుల్కల్



ఇటీవలే కురిసిన భారీ వర్షాలకు సింగూరు గ్రామంలో దెబ్బతిన్న పంటలను వ్యవసాయ అధికారులు గురువారం క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. అయితే అధికారులు వచ్చే ముందు తమకు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వలేదని.. తూతూ మంత్రంగా వచ్చి ఫోటోలు దిగి వెళ్లిపోయారని స్థానిక రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అప్పులు తెచ్చి పెట్టుబడి పెడితే పంట మొత్తం నీటి పాలైందని.. పెట్టుబడి కూడా వచ్చే దుస్థితి లేదని కంటతడి పెట్టారు. వ్యవసాయ అధికారులు నామమాత్రంగా వచ్చి వెళ్లడం సరికాదని.. ముందస్తుగా రైతులకు సమాచారం ఇచ్చి దెబ్బతిన్న ప్రతీ పంటను పరిశీలించాలన్నారు. అదేవిధంగా మండల వ్యవసాయాధికారి రైతులకు అందుబాటులో ఉండడం లేదని.. పంట నష్టం జరిగినప్పుడు కూడా ఇలా చేయడం సమంజసం కాదన్నారు. నష్టం జరిగిన ప్రతీ రైతుకు సాయం అందేలా అధికారులు చొరవ చూపాలన్నారు.

పంట పొలాలు పరిశీలించిన విజయరాజ్

నవతెలంగాణ-కొండాపూర్



మండల పరిధిలోని గంగారం గ్రామ రైతుల పంట పొలాలను కొండాపూర్ మహిళ వ్యవసాయ ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్ సీఈఓ విజయరాజ్ గురువారం సందర్శించారు. రైతుల పంటలకు ఎటువంటి రసాయన మందులు వాడుతున్నారని, ఏ విధమైన తెగుళ్ళు వస్తున్నాయని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పంటలను పరిశీలించి ఎన్‌పీఎస్‌ యాప్ ద్వారా పంట నివారణ చర్యలు గురించి చెప్పారు.

ప్రజాపాలన దినోత్సవ వేడుకలను పక్కాగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

నవతెలంగాణ-హవేలి ఘనాపూర్



తెలంగాణ ప్రజాపాల దినోత్సవ వేడుకలను పక్కాగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ 17న జరగబోయే తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా కే .కేశవరావు, (అడ్వైజర్ టు గవర్నమెంట్) రానున్నట్లు తెలిపారు. ఆ రోజున అన్ని పాఠశాలల్లో, కార్యాలయాల్లో ఉదయం 9:30 గంటల వరకు జాతీయ జెండాను ఎగురవేయాలన్నారు. అలాగే సమీకృత కలెక్టర్ కార్యాలయంలో ఉదయం పది గంటలకు ముఖ్య అతిథి చేతుల మీదుగా జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమం, ముఖ్యఅతిథి సందేశం, పోలీసుల గౌరవ వందనం స్వీకరణ, తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల ప్రదర్శనలు కార్యక్రమాలు ఉంటాయని అందుకుగాను మినట్ టూ మినట్ ప్రోగ్రామ్ షెడ్యూల్ తయారు చేసుకొని తగిన ఏర్పాట్లు చేయాలని వివిధ శాఖల అధికారులకు కలెక్టర్ సూచించారు.

మెదక్ జిల్లా ట్రాన్స్‌కో ఎస్ఈగా శంకర్

నవతెలంగాణ-హవేలి ఘనాపూర్



మెదక్ జిల్లా విద్యుత్తు శాఖ ట్రాన్స్‌కో సూపరింటెండెంట్ ఇంజనీర్ (ఎస్ఈ)గా శంకర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. మెదక్‌లో ఎస్ఈగా విధులు నిర్వహించిన జానకీరాములు ఉద్యోగ విరమణ చేయగా ఆయన స్థానంలో శంకర్‌ను బదిలీ చేయగా ఎస్ఈగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్ఈ శంకర్‌ను తెలంగాణ రాష్ట్ర విద్యుత్ కార్మిక సంఘం యూనియన్ నాయకులు ఓరం సత్యనారాయణ, ఉప్పర నర్సింగ్, అశోక్, రమేష్, రాజేశ్వర్, నాగరాజు, శేఖర్, శ్రీకాంత్, చంద్రమౌళి, కనకయ్య , రత్నం, రాములు , బాలకృష్ణ తదితరులు కలిసి పూలమాలతో సన్మానించారు. అనంతరం ఎస్ఈ శంకర్ మాట్లాడుతూ మెదక్ జిల్లాలో పని చేయడం ఎంతో ఆనందంగా ఉందని ప్రజలకు, ఉద్యోగులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు.

తహసీల్దార్‌గా సింధూ రేణుక బాధ్యతలు స్వీకరణ

నవతెలంగాణ-హవేలి ఘనాపూర్



హవేలి ఘనాపూర్ నూతన తహసిల్దారుగా సింధు రేణుక గురువారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం హవేలిఘనపూర్ ఇన్‌చార్జి తహసిల్దారుగా నవీన్ కుమార్ ఉండగా, ఆయన స్థానంలో సిసిఎల్ ఏ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు.

అనాథ ఆడబిడ్డలకు ఎఫ్డి బాండ్ అందజేత

నవతెలంగాణ-నిజాంపేట



ఇద్దరు ఆడబిడ్డలు అనాథలైన విషయాన్ని తెలుసుకున్న ప్రముఖ సంఘ సేవకులు జెడ్ చెరువు తాండవాసి డాక్టర్ మోహన్ నాయక్ ఆడబిడ్డల పేరు మీద రూ.10 వేలు ఫిక్స్ డిపాజిట్ చేసి బాండు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మానాన్నలు లేరన్న సంగతి తెలియడంతో తనకు చాలా బాధగా అనిపించి తన వంతు సహాయం చేయడం జరిగిందన్నారు. మెదక్ నియోజకవర్గంలో ఎక్కడైనా నిరుపేదలకు ఆపద వచ్చిందంటే ఆదుకుంటానన్నారు. ఈ కార్యక్రమంలో చల్మెడ మాజీ ఎంపీటీసీ బాల్రెడ్డి, చల్మేటి ప్రసాద్, రమావత్ రాజు, నరేందర్, బాబు, ధనరాజ్, పాల్గొన్నారు.

అనాథ ఆడబిడ్డలకు ఆర్థిక సహాయం

నవతెలంగాణ-నిజాంపేట



మండల కేంద్రానికి చెందిన చెరివిరాల శ్రీనివాస్ అనారోగ్యంతో దాదాపు 20 రోజుల క్రితం మృతి చెందారు. శ్రీనివాస్ భార్య కరోణతో దాదాపు నాలుగు సంవత్సరాల క్రితం మృతి చెందగా వారికి ఇద్దరు ఆడ కూతుర్లు తల్లితండ్రులు చనిపోవడంతో ఇద్దరూ ఆడబిడ్డలు అనాథలుగా మిగిలారు. మండల కేంద్రానికి చెందిన వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు రూ.11 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఇద్దరు అమ్మాయిలు చిన్నపిల్లలు అయినందున వారి చదువులకు ఉపయోగపడతాయన్నారు. మాతోపాటు ఇంకా ఎవరైనా దాతలు ఉంటే ముందుకు వచ్చి వారికి తోచిన సహాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మావురం రాజు, వెల్దుర్తి వెంకటేష్ గౌడ్, వెల్దుర్తి శ్రీకాంత్ గౌడ్, నాయిని లక్ష్మణ్, జీడి నవీన్ గౌడ్, ధనుంజయ, బజారు వినయ్ గౌడ్, పంపరీ నగేష్, మావురం రిచ్, తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-చేగుంట



మండలంలోని పులిమామిడి గ్రామ మాజీ సర్పంచ్ శ్రీ రామ్ రెడ్డి కూతురు ఇటీవల మరణించింది. విషయం తెలుసుకున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నారాయణరెడ్డి, కిష్టాపూర్ మాజీ సర్పంచ్ రాజగోపాల్, నాయకులు బాపురెడ్డి, మోహన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా దాచి ఉంచిన రేషన్ బియ్యం పట్టివేత

నవతెలంగాణ-చేర్యాల



చేర్యాల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆకునూరు గ్రామంలో అక్రమంగా దాచి ఉంచిన రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. టాస్కోఫోర్స్, చేర్యాల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం యాదాద్రి భువనగిరి జిల్లా రాజపేట మండలం పుట్టగూడెం గ్రామానికి చెందిన భూక్యా భూగులు 18 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఆకునూరు గ్రామానికి చెందిన బొగ్గు తిరుపతి ఇంట్లో దాచాడన్న నమ్మదగిన సమాచారంతో బుధవారం రాత్రి టాస్క్‌ఫోర్స్, చేర్యాల పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- ఎంపీ రఘునందన్ రావుకి ఉద్యోగుల వినతిపత్రం

నవతెలంగాణ-వర్గల్



సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యల పరిష్కరించడానికి చొరవ చూపాలని ఉద్యోగులు మెదక్ ఎంపీ రఘునందన్ రావుకు వినతి పత్రాన్ని అందజేశారు. గత సంవత్సరం సెప్టెంబర్ 13వ తేదీన సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన నెల రోజుల లోపు సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని, బేసిక్ పే (మినిమం టైం స్కేల్) అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ హామీని గుర్తు చేస్తూ అమలు చేసేలా చొరవ చూపాలని రఘునందన్ రావుని ఉద్యోగులు కోరారు. ఎంపీ స్పందిస్తూ సెంట్రల్ మినిస్టర్, సీఎంకు లెటర్ రాసి ఫార్వర్డ్ చేస్తానని. అలాగే ఢిల్లి వెళ్ళినపుడు సెంట్రల్ మినిస్టర్‌తో మాట్లాడుతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు డి యాదగిరి, సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్ పాల్గొన్నారు.

వినాయక మండపాల్లో అన్నదానం

నవతెలంగాణ-నంగునూరు



నంగునూరు మండల పరిధిలో వివిధ గ్రామాల్లోని వినాయక మండపాల వద్ద గురువారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. నంగునూరులో శ్రీరామ చైతన్య ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. వినాయక నవరాత్రోత్సవంలో అన్నదానానికి సహకరించిన దాతలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజా ప్రతినిధులు, కాలనీ సభ్యులు, ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

వినాయక మండపం వద్ద కుంకుమార్చన, అన్నదానం

నవతెలంగాణ-గజ్వేల్



గజ్వేల్‌లోని అయ్యప్ప నగర్ కాలనీలో ఏర్పాటుచేసిన వినాయక మండపంలో గురువారం మహిళల ఆధ్వర్యంలో అత్యంత భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షుడు వీరారెడ్డి మాట్లాడుతూ గణపతిని పూజిస్తే అంతా మంచి జరుగుతుందని, దాదాపు 24 ఏళ్ల నుంచి గణపతిని ఏర్పాటు చేస్తూ కాలనీవాసులు మమేకమై వినాయక నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయన్నారు. ఇందుకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప నగర్ కాలనీ గౌరవాధ్యక్షులు కాశీ ప్రసాద్, మహిళలు, చిన్నారులు, తదితరులు పాల్గొన్నారు.

లార్డ్ ఆశ్రమానికి కిరాణా సామాగ్రి అందజేత

నవ తెలంగాణ - సిద్దిపేట



వాసవి క్లబ్ ఆధ్వర్యంలో గజ్వేల్ పట్టణ వాస్తవ్యులు పొద్దుటూరి నగేష్ స్వప్నల సహాయంతో లార్డ్ ఆశ్రమంలో కిరాణా సామాగ్రి, రైస్ బ్యాగులు అందజేసినట్లు వాసవి క్లబ్ అధ్యక్షులు చకిలం రవి తెలిపారు. ఈ కార్యక్రమంలో వాసవి యూత్ క్లబ్ అధ్యక్షులు హరి కిరణ్, పాల్గొన్నారు.

ఏచూరి ఆశయ బాటలో కొనసాగుదాం

- జిల్లా కేంద్రం పోస్టాఫీసు వద్ద ఏచూరికి నివాళి

నవ తెలంగాణ-మెదక్ టౌన్



సీపీఎం పార్టీ ఆలిండియా కార్యదర్శి సీతారాం ఏచూరి ఆశయ సాధన కోసం మెదక్ జిల్లా కమిటీ పని చేస్తుందని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి ఏ.మల్లేశం అన్నారు. అనారోగ్యంతో 12వ తేదీన ఢిల్లీలో ఏమ్స్ ఆసుపత్రిలో చనిపోయారు. జిల్లా కేంద్రం అయిన పోస్టాఫీసు వద్ద ఆయన చిత్ర పటానికి సీపీఎం మెదక్ జిల్లా కమిటీ జిల్లా ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి ఏ. మల్లేశం మాట్లాడుతూ సీతారాం ఏచూరి మద్రాస్ (ప్రస్తుతం చెన్నై)లో తెలుగు కుటుంబంలో 12 ఆగస్టు 1952న జన్మించారన్నారు. ఏచూరి బాల్యం హైదరాబాద్‌లోనే గడిచిందన్నారు. ఇక్కడి ఆల్ సెయింట్స్ హైస్కూల్‌లో మెట్రిక్యులేషన్ పూర్తి చేశారన్నారు. అనంతరం ఢిల్లీకి వెళ్లి ప్రెసిడెంట్స్ ఎస్టేట్ స్కూల్‌లో 1970లో సీబీఎస్‌సీ హయ్యర్ సెకండరీ పరీక్షల్లో ఆల్ ఇండియా ర్యాంకర్‌గా నిలిచారన్నారు. విద్యార్థి నేతగా రాజకీయాల్లోకి ఎస్ఎఫ్ఐ విద్యార్థి నేతగా 1974లో సీతారాం ఏచూరి రాజకీయ ప్రస్థానం మొదలైందన్నారు. 1975లో జేఎన్‌యూ విద్యార్థిగా ఉన్నప్పుడు సీపీఐ(ఎం)లో చేరారని తెలిపారు. జేఎన్‌యూ స్టూడెంట్స్ యూనియన్‌కు మూడుసార్లు అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. సీపీఐ(ఎం) మాజీ ప్రధాన కార్యదర్శి ప్రకాశ్ కరాత్‌తో కలిసి జేఎన్‌యూను వామపక్ష కోటగా మార్చారు. ఎస్ఎఫ్ఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా, జాతీయ అధ్యక్షుడిగా పనిచేశారని తెలిపారు. 1984లో సీపీఐ(ఎం) కేంద్ర కమిటీలోకి వెళ్లిన ఆయన 1992లో ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడిగా ఎన్నికయ్యారన్నారు. 2005లో పశ్చిమ బెంగాల్ నుంచి తొలిసారి రాజ్యసభకు ఎన్నికయ్యారు. 2015లో విశాఖపట్నంలో జరిగిన 21వ సీపీఐ(ఎం) మహాసభల్లో పార్టీ ఐదో ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని తెలిపారు. ప్రజాసమస్యలపై గళం విప్పుతూ ప్రజాసమస్యలు, ఇతర అంశాలపై గళం విప్పుతూ ఎగువ సభలో సీతారాం ఏచూరి గుర్తింపు పొందారని తెలిపారు. 1996లో యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం కోసం 'కామన్ మినిమమ్ ప్రోగ్రామ్' ముసాయిదాను రూపొందించడంలో మాజీ కేంద్ర మంత్రి పి.చిదంబరంతో పాటు ఏచూరి కీలక పాత్ర పోషించారన్నారు. 2004లో యూపీఏ సంకీర్ణ ప్రభుత్వ నిర్మాణంలోనూ ఏచూరి ముఖ్య భూమిక పోషించారన్నారు. ఎచూరికి రచయితగానూ మంచి గుర్తింపు ఉందని, 'లెఫ్ట్ హ్యాండ్ డ్రైవ్' పేరిట ఓ ఆంగ్ల పత్రికకు కాలమ్స్ రాశారని తెలిపారు. 'క్యాస్ట్ అండ్ క్లాస్ ఇన్ ఇండియన్ పాలిటిక్స్ టుడే', 'సోషలిజం ఇన్ ఛేంజింగ్ వరల్డ్', 'మోదీ గవర్నమెంట్ న్యూ సర్జ్ ఆఫ్ కమ్యూనలిజం', 'కమ్యూనలిజం వర్సెస్ సెక్యులరిజం' వంటి పుస్తకాలు రాశారని తెలిపారు. ఆయన మరణం తో సీపీఎం పార్టీ దేశవ్యాప్తంగా దిగ్భ్రాంతిలో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె నర్సమ్మ, కె మల్లేశం, బస్వరాజు, జిల్లా కమిటి సభ్యులు సంతోష్, నాయకులు సత్యనారాయణ, కొమ్రయ్య, పద్మారావు తదితరులు పాల్గొన్నారు.

రాజి మార్గమే రాజమార్గం అనే నినాదాన్ని ప్రజల్లో నింపాలి

- నేషనల్ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి
- మెదక్ కోర్టు ప్రాంగణంలో 28న నేషనల్ లోక్ అదాలత్
- ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యే విధంగా న్యాయవాదులు సహకరించాలి

నవ తెలంగాణ-మెదక్ టౌన్



మెదక్‌లో ఇన్సూరెన్సు స్టాండింగ్ కౌన్సిల్స్, బ్యాంకు, చిట్ఫండ్స్ కౌన్సిల్స్, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అండ్ మెంబర్స్‌తో మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయమూర్తి లక్ష్మీ శారద మాట్లాడుతూ నేషనల్ లోక్ అదాలత్ 28వ తేదిన జిల్లా కోర్ట్ ప్రాంగణంలో, నర్సాపూర్ కోర్టులో నిర్వహించబడుతుందని తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులను పరిష్కరించుకునే విధంగా న్యాయవాదులు సహకరించాలని కోరారు. ఈ సదావకాశాన్ని ప్రజలు, కక్షిదారులు వినియోగించుకుని ఎక్కువ మొత్తంలో కేసులను రాజీ కుదుర్చుకొని, నేషనల్ లోక్ అదాలత్‌ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జితేందర్, సెక్రటరీ కమ్ సీనియర్ సివిల్ జడ్జి జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ, ఇన్సూరెన్సు స్టాండింగ్ కౌన్సిల్స్, చిట్ఫండ్స్ కౌన్సిల్స్, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అండ్ మెంబర్స్, అడ్వకేట్స్, ప్యానల్ లాయర్స్, రిటైనర్ లాయర్స్, ఇతర న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కాంప్లెక్స్ హెడ్మాస్టర్ ఆదేశాలను బేకాతర్ చేసిన ఎస్‌జిటి ఉపాధ్యాయుడు

- ఉపాధ్యాయుడు లేక పాఠశాల అవరణలో క్రీడలు ఆడుతున్న విద్యార్థులు

నవతెలంగాణ-వెల్దుర్తి



మండల పరిధి కుక్కునూరు గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు సీతారాం కుకునూరు పాఠశాలకు చెందిన ఎస్‌జిటి ఉపాధ్యాయుడు నవీన్ సమీపంలో గల బస్వాపూర్ పాఠశాలకు వెళ్లాలని ఆదేశించగా బస్వాపూర్ పాఠశాలలో ఒక ఉపాధ్యాయుడు గురువారం లీవ్‌లో ఉన్నందున మీరు వెళ్లాలని కాంప్లెక్స్ హెడ్మాస్టర్ ఎస్జీటీ ఉపాధ్యాయిడిని ఆదేశించాలన్నారు. ఎస్‌జిటి ఉపాధ్యాయుడు వెళ్లకపోవడంతో బస్వాపూర్ పాఠశాలలో చదివే విద్యార్థిని విద్యార్థులు పాఠశాల ఆవరణంలో ఉదయం 11:30 గంటలు దాటినా ఉపాధ్యాయుడు రాకపోవడంతో విద్యార్థిని విద్యార్థులు పాఠశాల ఆవరణంలో క్రీడలు ఆడుతూ తల్లిదండ్రులకు కనిపించారన్నారు. ఈ విషయమై విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రైవేట్ స్కూళ్లకు పంపించలేని తాము ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తే ఇక్కడ ఉపాధ్యాయులు సమయానికి రాక సరిగా విద్యాబోధన జరగక తమ పిల్లలు ఆగమవుతున్నారని ఉపాధ్యాయులపై మండిపడ్డారు. తమ పిల్లలు ఎలా ప్రయోజకుల వుతారన్నారు ఇప్పటికైనా ప్రభుత్వ ఉపాధ్యాయులు పోస్టులను పెంచి గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులను ప్రయోజకులుగా చేసే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని వారు కోరారు. ఈ విషయమై కాంప్లెక్స్ హెడ్ మాస్టర్‌ను వివరణ అడగగా తాను తూప్రాన్‌లో డీఈవో మీటింగ్‌కు వెళ్లానని సమాధానం చెప్పారు. అలాగే ఉన్నత పాఠశాలలోని సిఆర్పి ఆగమయ్య ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే పాఠశాలకు రాలేదని తెలిపారు.

మాతా శిశు సంరక్షణ సంపూర్ణ ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

- అల్లాదుర్గం ఐసీడీఎస్ సీడీపీఓ పద్మాలత.

నవతెలంగాణ-పెద్ద శంకరంపేట్



మాతా శిశు సంపూర్ణ ఆరోగ్యం రక్షణనే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం ముందుకు సాగుతుందని, అల్లాదుర్గం ఐసీడీఎస్ సీడీపీఓ పద్మాలత పేర్కొన్నారు. గురువారం పెద్ద శంకరంపేట మండల పరిధిలోని రామోజీ పల్లి గ్రామంలో నిర్వహించిన, పోషణ్ అభియాన్ మాస ఉత్సవాలు పాల్గొని మాట్లాడారు. గర్భిణీ స్త్రీలకు బాలింతలకు ప్రభుత్వం మంచి నాణ్యమైన ఆహారాన్ని అందిస్తుందని వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సెప్టెంబర్ ఒకటవ తేదీ నుంచి చివరి వారం వరకు ఈ పోషణ కార్యక్రమం కొనసాగుతుందని వివరించారు. గర్భిణీ స్త్రీలు బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఐసీడీఎస్ సిబ్బంది. అంగన్వాడి కేంద్రాలలో అంగన్వాడీ టీచర్లు వివరిస్తారని తెలిపారు. అనంతరం పోషణ మాసం సందర్భంగా చిన్నారులకు అన్నప్రాసన, సీమంతాలు, అక్షరాభ్యాసం, కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్వైజర్ పుష్పలత. ఐసీడీఎస్ సిబ్బంది, వెంకట్ అంగన్వాడి టీచర్ విజయ నిర్మల గర్భిణీ స్త్రీలు బాలింతలుపాల్గొన్నారు.

బదిలీ అయి రిలీవ్ కానీ టీచర్లను విడుదల చేయాలి

- ఎస్టీయు జిల్లా అధ్యక్షులు రాజగోపాల్ గౌడ్

నవతెలంగాణ- వెల్దుర్తి



జూన్ నెలలో జరిగిన ఉపాధ్యాయ బదిలీలలో బదిలీ అయి రిలీవ్ కాకుండా యధా స్థానంలో కొనసాగుతున్న టీచర్లను వెంటనే రిలీవ్ చేయాలని ఎస్టీయు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజగోపాల్ గౌడ్ పోచయ్యలు ప్రభుత్వ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో రాష్ట్ర కార్యదర్శి రాజుతో కలిసి సభ్యత్వ క్యాంపియన్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బదిలీ అయిన టీచర్లను వెంటనే విడుదల చేయాలని ఆన్లైన్ సాంకేతిక తప్పిదాలతో బదిలీ అయిన వారి తప్పిదాలను సవరించి వారికి న్యాయం చేయాలని వారు కోరారు. ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలకు సర్వీస్ పర్సన్ల నియమాలకు సంబంధించి నిధులు, నిబంధనలు, విడుదల చేయాలని అకాడమీ ఇయర్ ప్రారంభమై నాలుగు మాసాలు కావస్తున్న స్కూల్ గ్రాంటు మంజూరు చేయాలని నాణ్యమైన విద్య అందించేందుకు రెగ్యులర్ పర్యవేక్షణ అధికారులను నియామకం చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. మండలంలోని వెల్దుర్తి, మంగల్పర్తి, మానేపల్లి, కుకునూర్, వివిధ పాఠశాలల్లో సభ్యత్వం నిర్వహించి ఉపాధ్యాయుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాధ్యులు రమేష్ గౌడ్, శ్రీకాంత్ గౌడ్, శివప్రసాద్, సత్యనారాయణ, జబ్బర్, చంద్రం, మండల అధ్యక్షులు రాములు, ప్రధాన కార్యదర్శి జహీరుద్దీన్, పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సేవలు ఎప్పుడూ మరువలేనివి

నవతెలంగాణ-తొగుట



విద్యార్థుల ఉన్నతికి నిరంతరం శ్రమించే ఉపాధ్యాయుల కృషి ఎప్పటికీ మర్చిపోలేనిదని గణపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అంజలి అన్నారు. గురువారం ప్రాథమిక పాఠశాలలో సుదీర్ఘ కాలం విధులు నిర్వర్తించి బదిలీపై వెళ్లిన సుధాకర్, రాజశ్రీ, వెంకటేశ్వర్లు వనజ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధా నోపాధ్యాయురాలు అంజలి మాట్లాడుతూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేసేందుకు ఉపాధ్యాయుల సేవలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చంద్రకళ, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ రాజేశ్వరి, పాఠశాల ఉపా ధ్యాయులు శేఖర్, లక్ష్మారెడ్డి, వనజ, రవీందర్, రాజ్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎరువుల డీలర్లకు శిక్షణ కార్యక్రమం పూర్తి

- జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్

నవతెలంగాణ- కౌడిపల్లి



ఎరువుల డీలర్లకు శిక్షణ కార్యక్రమం పూర్తయిందని జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ పేర్కొన్నారు. వ్యవసాయ శాఖ మెదక్ జిల్లా ఆధ్వర్యంలో వ్యవసాయ ఉత్పాధక పంపిణీ దారుల డిప్లమో కోర్సులో భాగంగా 48 వారాలపాటు శిక్షణ తరగతులు నిర్వహించి శిక్షణలో నేర్చుకున్నే అంశాల మీద గురువారం తుది పరీక్ష మండల పరిధిలోని తునికి కృషి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తన పురుగు మందులు అమ్మే డీలర్లు వ్యవసాయంలోని విత్తన దశ నుంచి పంటకోత వరకు వివిధ దశల్లో వివిధ పంటల్లో చీడపీడ నివారణకు ఉపయోగించు పురుగు తెగుళ్ల మందుల మోతాదుతో పాటు ఏ విధంగా వాడాలో ఈ శిక్షణ కాలంలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో తమ షాపు వద్దకు వచ్చేటువంటి రైతులకు తర్ఫీదు ఇచ్చే విధంగా విత్తన డీలర్లకు ఈ శిక్షణ కార్యక్రమం ఉపయోగ పడుతుందన్నారు. శిక్షణానంతరం సర్టిఫికెట్ జారీ చేయ బడుతుందన్నారు. ఇది కేవలం ఎరువులు పురుగుమందుల డీలర్లకే కాకుండా యువ రైతులకు కూడా సువర్ణ అవకాశం ఈ డిప్లమో కోర్సు చేసిన యువ రైతులకు సర్టిఫికెట్ పొందే అవకాశం ఉంది ఈ సర్టిఫికేట్ ఆధారంగా ఎరువులు పురుగుమందుల దుకాణాలను నెలకొల్పి గ్రామస్థాయిలో ఆర్థిక అభివృద్ధి చెందే అవకాశం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శిల్ప మేనేజ్ కన్సల్టెంట్, శ్రీ మతి సుధారాణి, సహాయ వ్యవసాయ సంచాలకులు, సుమతి ఏడిఏ పుణ్య వతి , మండల వ్యవసాయ అధికారులు స్వప్న, రాజ్ నారాయణ, డైసీ ఫెసిలిటేటర్లు అమరేశ్ కుమార్ ,సరేంద్ర ఎరువుల డీలర్ల లు పాల్గొన్నారు.

ఏచూరి మృతికి పలువురి సంతాపం

నవతెలంగాణ-చేర్యాల





కామ్రేడ్ సీతారాం ఏచూరి మరణం చాలా బాధకు గురిచేసిందని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఏచూరి మృతికి సంతాపం తెలిపారు. చాలామంది యువకులకు, సమాజమార్పు కోరే యువతకు ఆదర్శంగా ఏచూరి నిలిచారని, జె ఎన్ యు విద్యార్థి నాయకునిగా ఉండి అనేక మంది విద్యార్థి నాయకులకు స్ఫూర్తినిచ్చారన్నారు. విద్యార్థి దశలోనే వామపక్ష భావజాలానికి తాను ఆకర్షితులవడానికి స్ఫూర్తిదాత సీతారాం అని పేర్కొన్నారు. భారతదేశంలో సమసమాజం ఏర్పడాలని ఆశించి చివరి క్షణం వరకు దానికోసమే పని చేసిన సిద్ధాంతకర్త సీతారాం అని ఆయనకు శ్రద్ధాంజలి ఘటిస్తున్నానని తెలిపారు.

నవతెలంగాణ-కొమురవెల్లి



సీపీఐ(ఎం) అఖిల భరత ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి మృతి పార్టీకి తీరని లోటని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యురాలు అత్తిని శారద అన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో సంతాపం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు తాడూరి రవీందర్, మండల నాయకులు తేలు ఇస్తారి, తాడూరి మల్లేశం, సుక్క ఎల్లయ్య, ఆరుట్ల రవీందర్, తాడూరి భరత్ ,నవీన్, రాజేశం, దినేష్ తదితరులు పాల్గొన్నారులి

నవ తెలంగాణ-గజ్వేల్

సీపీఐ(ఎం) అగ్రనేత సీతారాం ఏచూరి మరణం పేద బడుగు బలహీన వర్గాలకు తీరని లోటని డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి సంతాపం వ్యక్తం చేశారు. సీతారాం మరణంతో కమ్యూనిస్ట్ పార్టీలో తీవ్ర విషాదం నెలకొందన్నారు. ఏచూరి మరణంతో ఆయన అభిమానులు, అనుచరులు.. పార్టీ కార్యకర్తలు కన్నీరు మున్నీరవుతున్నారన్నారు. ఊపిరితిత్తుల్లో ఇన్‌ఫెక్షన్ తొలగించేందుకు ఉపయోగించిన మందులు పనిచేయక పోవడంతో జపాన్ నుంచి కూడా ప్రత్యేక మందులు తెప్పించి ప్రయత్నాలు చేసినప్పటికీ చివరకు కన్నుమూశారన్నారు. దీంతో దేశం మంచి నేతను కోల్పోయిందన్నారు.

పట్టుదలతో పని చేస్తే విజయం వరిస్తుంది

- మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు

నవతెలంగాణ-పాపన్నపేట



పట్టుదలతో పని చేస్తే విజయం వరిస్తుందని మెదక్ మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. మండల కేంద్రమైన పాపన్నపేటలో గురువారం జరిగిన ఎసీఎఫ్ క్రీడల బహుమతి ప్రధాన ఉత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఆటల్లో ఓడిన విద్యార్థులు పట్టు వదలకుండా విజయం కోసం కృషి చేయాలని, ఎప్పడు కూడా తమ లక్ష్యాన్ని మధ్యలో విడిచిపెట్టవద్దని సూచించారు. నిరంతర శ్రమతో సమాంతర రేఖలను కూడా కలుపొచ్చని చెప్పారు. విజేతలకు బహుమతులు అందజేశారు. అంతకు ముందు అర్కెల గ్రామంలో వినాయక నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొని, పూజలు చేసి అన్నదాన కార్యక్రమంలో వడ్డించారు. మాజీ కాంగ్రెస్ నాయకులు రాజు, రాజశేఖర్ పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జనార్ధన్ రెడ్డి, విక్కివినోద, ప్రభాకర్ రెడ్డి,ప్రశాంత్ రెడ్డి,శ్రీకాంతప్ప,ఆకుల శ్రీ ను, ఆవుల గోపాల్ రెడ్డి, శ్రీకాంత్రెడ్డి, గౌస్, డీలర్ శ్రీను, నరేందర్ గౌడ్,నిరలాక్షప్ప, రాంరెడ్డి, హెచ్ఎం మహేశ్వర్, టీచర్లు నాగరాజు, అంజాగౌడ్,వీఇటిలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీ సదస్సుని సందర్శించిన సీఎండి సతీష్ కుమార్

నవతెలంగాణ-హవేలి ఘనాపూర్



హవేలీ ఘనపూర్ మండలంలోని తొగిట ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఫిజియోథెరపీ పరీక్షల కార్యక్రమాన్ని ఫిజియోథెరపీ సిఎండి సతీష్ కుమార్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శారీరిక, నరాల సమస్యలు ఉన్న విద్యార్థులకు ప్రతి వారం జరిగే ఫిజియోథెరపీ సదస్సును ఉపయోగ పడు తుందన్నారు. ఈ సదస్సులో ప్రధానోపాధ్యాయులు రాజా రామ్ చంద్రరావు, మండల సెర్ప్ ఎం అరుణ, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- ప్రజలు ఓటీపీలు ఎవరికి చెప్పవద్దు
- ఎస్సై పరశురాం

నవ తెలంగాణ-మిరుదొడ్డి



మాయమాటలు చెప్పి సైబర్ నేరగాళ్లు మోసం చేయడానికి చూస్తున్నారని మిరుదొడ్డి ఎస్సై పరశురాం అన్నారు. వారి మాటలకు బోల్తా పడితే అకౌంట్లో ఉన్న పైసలు ఖాళీ కావడం ఖాయమన్నారు. అక్బర్ పేట భూంపల్లి మండలం రుద్రారం గ్రామంలో పోలీసులు కనువిప్పు కార్యక్రమాన్ని నిర్వహించారు. సైబర్ మోసాలపై పోలీస్ కళాకారుల బృందం గ్రామస్తులకు అవగాహన కల్పించారు. మన ప్రమేయం లేకుండా సైబర్ నేరగాళ్లు మోసం చేసే అవకాశం లేదన్నారు. ఏదైనా ఓటీపీ ఫోన్‌కు వచ్చినట్లయితే మాయమాటలు చెప్పి సైబర్ నేరగాళ్లు ఓటిపి తెలుసుకునే ప్రయత్నం చేస్తారన్నారు. ఓటిపి చెప్పిన వెంటనే సైబర్ నేరగాళ్లుబాధితుల అకౌంట్లో నుంచి డబ్బులు కాజేస్తారని వెల్లడించారు. తెలియని వ్యక్తులు ఫోన్ చేసి బ్యాంక్ నుంచి మాట్లాడుతున్నామని క్రెడిట్ కార్డ్ ఇస్తామని ఓటీపీ నెంబర్ చెప్పమని అడిగితే ఎట్టి పరిస్థితుల్లో చెప్పవద్దన్నారు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

జిల్లా విద్యుత్తు అధికారికి ఘనంగా సన్మానం

నవతెలంగాణ-నిజాంపేట



మెదక్ జిల్లా నూతన విద్యుత్ శాఖ అధికారిగా (సూపరిండెంట్ ఆఫ్ ఇంజనీర్) బాధ్యతలు స్వీకరించిన అధికారికి తూప్రాన్ డివిజన్ 1104 యూనియన్ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. శాలువాగప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రసాద్, వేణు, నగేష్, చందు, బైరం రమేష్ ,తిరుపతి, పడు చూరి రాజు, సంజీవ్, దేవుని రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

చెరువులను పరిశీలించిన చైర్మన్

- గణపతి నిమజ్జన కార్యక్రమాన్ని శాంతియుతంగా నిర్వహించుకోవాలి
- మున్సిపల్ చైర్మన్ రాజమౌళి



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్‌లోని పాండవుల చెరువు, ప్రజ్ఞాపూర్ ఊర చెరువుల వద్ద గణేష్ నిమజ్జనం కోసం ఏర్పాట్లను మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, సిఐ సైదా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గణపతి నిమజ్జన కార్యక్రమాన్ని శాంతియుతంగా నిర్వహించుకోవాలని, సాయంకాలం త్వరగా గంటల గణపతి మండపాల నుంచి శోభ యాత్ర నిర్వహించాలని, పెద్దపెద్ద డిజె బాక్సులు పెట్టకుండా, భక్తి భజనలతో శోభాయాత్ర నిర్వహించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నరసయ్య, వైస్ చైర్మన్ జక్కి ఉద్దీన్, కౌన్సిలర్స్ వంటేరు గోపాల్ రెడ్డి, గంగిశెట్టి చందన రవీందర్,బొల్లిపల్లి బలమణి శ్రీనివాస్ రెడ్డి,మున్సిపల్ ఏ ఈ శ్రీధర్ రెడ్డి, ఎలక్ట్రికల్ ఏ ఈ, మారుతీ, సానిటరీ ఇన్స్పెక్టర్ రవీందర్, వార్డ్ సభ్యులు, నాయకులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

పౌష్టికాహారంతో పిల్లల్లో ఆరోగ్యం

- పోషణ మాసం కార్యక్రమంలో ఏసీడీపీఓ

నవ తెలంగాణ-సిద్దిపేట అర్బన్



అంగన్వాడీ కేంద్రంలో ఉండే పిల్లలకు పౌష్టిక ఆహారాన్ని ఇవ్వడం ద్వారా ఆరోగ్యవంతంగా పిల్లలను తీర్చిదిద్దవచ్చని ఏసీడీపీఓ ఛాయాదేవి అన్నారు. గురువారం సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల మధిర గాంధీ నగర్ అంగన్వాడీ కేంద్రంలో పోషణ మాసం వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భవతులకు బాలింతలకు పోషణ ఆహారంపై అవగాహన కల్పించారు. పౌష్టిక ఆహారం తీసుకోవడం వలన కలిగే లాభాలను వివరించారు. కార్యక్రమంలో సూపర్వైజర్ వసంత, డాక్టర్ సునంద, శ్రీనివాస్, అంగన్వాడీ టీచర్ విజయలక్ష్మి, ఆయా శ్రావణి, ఆశా వర్కర్ సంతోష, ప్రైమరీ హై స్కూల్ ఉపాధ్యాయురాలు కళ్యాణి, గర్భవతులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను పరామర్శించిన హరీశ్ రావు

నవతెలంగాణ-సిద్దిపేట



1వ వార్డ్ లింగారెడ్డి పల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు (హై కోర్టు న్యాయవాది) వంగ హన్మంత రెడ్డి తల్లి రాజవ్వ ఇటీవల మరణించారు. దీంతో వారి కుటుంబాన్ని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు పరామర్శించారు. అదేవిధంగా 24వ వార్డ్‌కు చెందిన, వీరబత్తిని జనార్ధన్ తండ్రి వీరబత్తిని భూమయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన చిత్ర పటానికి హరీశ్‌రావు పూల మాల వేసి నివాళులర్పించారు. పట్టణంలోని 3వ వార్డ్‌కు చెందిన చర్చి పాస్టర్ మత్తయి భార్య సువార్త అనారోగ్యంతో మృతి చెందగా, మృత దేహానికి నివాళ్లు అర్పించి, వారి కుటుంబాన్ని ఓదార్చారు. ఆయన వెంబడి బీఆర్ఎస్ నాయకులు, ప్రజా ప్రతినిధులు ఉన్నారు.

కిడ్నీ బాధితునికి ఎల్ఓసీ అందించిన పూజల హరి కృష్ణ

నవతెలంగాణ-సిద్దిపేట



కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న, ఆర్థిక ఇబ్బందులతో వైద్యం చేయించుకోవడానికి వీలులేదని తెలిసి సీఎం సహాయ నిధి నుంచి రూ.2.50 లక్షల ఎల్ఓసీని అందించినట్లు సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ పూజల హరికృష్ణ తెలిపారు. గురువారం కిడ్నీ వ్యాధిగ్రస్తుడు భగవాన్‌కు కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో ఎల్ఓసిని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా ఇన్చార్జ్ మినిస్టర్ కొండా సురేఖ దృష్టికి తీసుకెళ్లి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా బాధితునికి ఆర్థిక సహాయాన్ని అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు ముద్దం లక్ష్మి, నాయకులు రాములు, మంద పాండు, చెంది శ్రీనివాస్, నాంపల్లి శేఖర్, వనజ, సంతోషి, శారద, కవిత పాల్గొన్నారు.

వినాయక నిమజ్జన ఏర్పాట్లలో నిర్లక్ష్యం వద్దు

- మున్సిపల్ చైర్మన్ ఆకుల రజిత

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్



హుస్నాబాద్ పట్టణంలో నెలకొల్పిన వినాయకలను ఎల్లమ్మ చెరువులో నిమజ్జనం చేసే ఏర్పాట్లలో నిర్లక్ష్యం చేయవద్దని హుస్నాబాద్ మున్సిపల్ చైర్మన్ ఆకుల రజిత వెంకన్న అన్నారు. గురువారం మున్సిపల్ చైర్మన్ ఆకుల రజిత కమిషనర్ మల్లికార్జున్ రెడ్డితో కలిసి వినాయక నిమజ్జన ఏర్పాట్లు పరిశీలించారు. నిమజ్జనం చేసేటప్పుడు ప్రజలకు ఎవరికి ఇబ్బంది కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గణేష్ నిమజ్జనం చేసే ప్రదేశంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు. అనంతరం పట్టణంలో అభివృద్ధి పనుల్లో భాగంగా ఎఫ్ఎస్‌టిపి పనులను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ గౌడ్, కౌన్సిలర్లు పున్న లావణ్య సది, వల్లపు రాజు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పృథ్వి , సానిటరీ ఇన్స్పెక్టర్ బాల ఎల్లం పాల్గొన్నారు.

సరైన పోషణతో సంపూర్ణ ఆరోగ్యం

నవతెలంగాణ-సిద్దిపేటరూరల్



సరైన పోషణతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని డాక్టర్ అజయ్ అన్నారు. గురువారం సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని తోర్నాల అంగన్వాడి కేంద్రంలో పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలకు పిల్లలకు పౌష్టికాహార లోపంతో ఉండకూడదని ప్రభుత్వం అన్ని రకాల విటమిన్స్ ఉండే ఆహారాన్ని పంపిణీ చేస్తుందన్నారు. రోజు తినే ఆహారంలో మొలకలు, ఆకుకూరలు, పాలు, గుడ్లు, బెల్లం, పల్లీలు, నువ్వులు, బీట్రూట్, క్యారెట్, ఉండే విధంగా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జీవన్ రెడ్డి, ఏఎన్ఎం కరుణావతి, జ్యోతి, మహిళలు పాల్గొన్నారు.

గురుకుల కళాశాలలో 14న ఇంటర్ స్పాట్ అడ్మిషన్లు


నవతెలంగాణ-చేర్యాల

సిద్దిపేట జిల్లాలోని అల్వాల్, చేర్యాల, గుర్రాలగొంది, దుబ్బాక, హుస్నాబాద్, కోహెడ, దుద్దెడ, ప్రజ్ఞాపూర్‌లోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాలలో 14న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు జిల్లా కో ఆర్డినేటర్ బి.అశోక్ బాబు తెలిపారు. మండల కేంద్రంలోని గురుకుల కళాశాలలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇంటర్మీడియట్ ఇంగ్లీష్ మీడియం మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీ, సీఈసీలలో ఖాళీగా ఉన్న సీట్లభర్తీ కొరకు అర్హత కలిగిన అభ్యర్థులకు ఈనెల 14న శనివారం ఉదయం 10గంటలకు చేర్యాల మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఒరిజినల్, జిరాక్స్ కాపీలతో స్పాట్ అడ్మిషన్‌కు హాజరుకావాలని కోరారు. అదే రోజు జిల్లాలోని హుస్నాబాద్, చౌదరిపల్లి, కొండపాక, రామక్కపేట, ఎన్సాన్పల్లి, తోగుటలోని బాలికల సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలకు సంబంధించిన స్పాట్ అడ్మిషన్లు ఎన్సాన్పల్లిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఎర్రవల్లి తెలంగాణ రాష్ట్రానికే ఆదర్శం

- మట్టి గణపతితో స్ఫూర్తినిచ్చిన హనుమాన్ భక్త మండలి
- ఘనంగా సన్మానించిన సంస్థ అధ్యక్షులు రామకోటి రామరాజు


నవతెలంగాణ-మర్కుక్



భగవంతుని పేరు చెపితే చాలు ఆ గ్రామంలో ప్రతి భక్తుడు కూడా భక్తితో పరవశిస్తారని, అందుకే అ గ్రామం గణపతి ప్రతిష్టించడంలో ఎర్రవల్లి 50 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. ఈ విషయం తెలుసు కున్న శ్రీరామకోటి ధార్మిక సేవా సంస్థ గురువారం ఎర్రవల్లి హనుమాన్ భక్త మండలి వారిని శాలువా కప్పి సీతారాముల చిత్ర పటాన్ని అందజేశారు. సంస్థ వ్యవస్థాపక, అధ్యక్షులు, భక్తిరత్న, కళారత్న, సేవారత్న అవార్డు గ్రహీత రామకోటి రామరాజు ఈ సందర్భంగా మాట్లాడుతూ భగవంతుని సేవలో తరించే భాగ్యం అందరికీ రాదన్నారు. గణపతి నవరాత్రులే కాకుండ ప్రతిరోజూ నామ సంకీర్తనలో పాల్గొనడం. ఈ గ్రామం విశిష్టత అని కొనియాడారు.


ఉత్తమ ఉపాధ్యాయునికి సన్మానం

నవతెలంగాణ-మర్కుక్



2024 జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన మర్కుక్ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు సిద్దయ్యను మర్కుక్ మాజీ సర్పంచ్ అచ్చం భాస్కర్, నాయకులు బబ్బూరి సతీష్ గౌడ్‌లు ఘనంగా సన్మానించారు. అనంతరం పీఆర్టీయూ మర్కుక్ నూతన మండలాధ్యక్షులుగా ఎన్నికైన ఆర్.శ్రీనివాస రావును సన్మానించారు. ఈ కార్యక్రమంలో మర్కుక్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశం, వందన, శ్రీనివాసరావు, రమణారావు, బుచ్చయ్య , మాధవి, తదితరులున్నారు.

పేదలకోసమే పని చేశారు



నవతెలంగాణ-గజ్వేల్

సీపీఐ (ఎం) జాతీయ అగ్రనేత సీతారాం ఏచూరి బతికినంత కాలం పేదల కోసమే పని చేశారని, ఆయన మృతి దేశానికి తీరని లోటని బీఆర్ఎస్ పార్టీ గజ్వేల్ ఇన్చార్జి వంటేరు ప్రతాపరెడ్డి అన్నారు. పేదల గొంతు మూగబోయినట్లేనని ఆయన ఆవేదన చెందారు. సీతారాం ఏచూరి కుటుంబం పేదల కోసం పనిచేస్తుందన్నారు. పార్టీ క్రమశిక్షణ సిద్ధాంతాలకు కట్టుబడి ఉంటూ పేదల పక్షాన పోరాడే నాయకుడిగా దేశంలోనే అగ్రనేతగా పేరు తెచ్చుకున్న సీతారాం ఏచూరి మరణం అందరికీ తీరని లోటన్నారు. రాజ్యసభ, పార్లమెంటులో పేదలకు న్యాయం జరగాలని ఆయన గొంతును ప్రజల కోసం అంకితం చేసి మాట్లాడారన్నారు.

కొండపాకలో సత్య సాయి సంజీవని చైల్డ్ కార్డియాక్ ఆసుపత్రి

- ఉమ్మడి రాష్ట్రంలో మొదటిది
- 14 న ప్రారంభించనున్న ముఖ్యమంత్రి

నవతెలంగాణ-కొండపాక

పేద ప్రజలకు విద్య వైద్య సేవలు దేశ విదేశాల్లో అందిస్తున్న సత్యసాయి సేవ సంస్థ తెలంగాణ రాష్ట్రానికి విస్తరించింది. పేద ప్రజలకు ఉచితంగా అత్యాధునికమైన వైద్య సేవలు అందించడానికి సిద్దిపేట జిల్లా కొండపాక శివారులో ఆనంద నిలయం సమీపంలో ఐదు ఎకరాల విస్తీర్ణంలో రూ.50 కోట్ల వ్యయంతో చిన్నపిల్లల గుండె ఆపరేషన్ల చికిత్స కోసం అధునాతన విధానంతో వంద పడకల వసతి, రోజుకు పదికి పైగా ఆపరేషన్లు చేసే విధానంతో ఆసుపత్రికి శ్రీకారం చుట్టి పనులన్నీ పూర్తి చేసుకుంది. సత్య సాయి హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సత్య సాయి సంజీవని సెంటర్ ఫర్ చైల్డ్ హార్ట్ కేర్ అండ్ రీసెర్చ్ పేరిట ఆస్పత్రిని ఏర్పాటు చేశారు. దీనిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వైద్య ఆరోగ్య శాఖమంత్రి దామోదర రాజనరసింహ, సద్గురు మధుసూదన సాయి శనివారం 11 గంటలకు ప్రారంభించనున్నారు.

చైల్డ్ కార్డియాలజీ ఆస్పత్రి ఏర్పాటులో దేశంలో నాలుగోది

తెలంగాణ రాష్ట్రానికి సెంటర్ పాయింట్‌గా ఉన్న సిద్దిపేట ప్రాంతంలో ఆస్పత్రిని ఏర్పాటు చేయాలని సత్య సాయి సేవ సంస్థ నిర్ణయించారు. విద్య వైద్యం ప్రజలకు ఉచితంగా అందించాలని ప్రధాన ధ్యేయంగా కృషి చేస్తున్న సంస్థ కొండపాక శివారులోని ఆనంద నిలయం ట్రస్ట్ ఆవరణలో ఉన్న సుమారు పన్నెండున్నర ఎకరాల విస్తీర్ణంలో సత్యసాయి విద్య సంస్థను ఏర్పాటు చేశారు. ఇక్కడ బాలికలకు ఇంటర్ నుంచి డిగ్రీ వరకు ఉచితంగా విద్యను అందిస్తున్నారు. గత ఐదేళ్ల నుంచి ఇక్కడ సంస్థ సేవలు కొనసాగుతున్నాయి. ఇదే ప్రాంతంలో ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని సంకల్పించి శ్రీకారం చుట్టారు. ఇది దేశంలో నాలుగవదిగా నిలుస్తుంది

చిన్న పిల్లల ఆపరేషన్ ఆసుపత్రి ఉమ్మడి రాష్ట్రంలో మొదటిది

ఎంతోమంది చిన్న పిల్లలు పుట్టుకతో గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ చికిత్స చేసుకోలేక ఇబ్బందులకు గురవుతున్నారు. భవిష్యత్ తరాలను కాపాడాలని ప్రధాన ఉద్దేశంతో పుట్టుకతో గుండెకు ఛిద్రం పడి మృత్యువాత పడుతున్న వారిని కాపాడడం కోసం అధునాతన పరికరాలతో ఆసుపత్రి ఏర్పాటు చేశారు.

సత్య సాయి సేవ సంస్థ ఆధ్వర్యంలో దేశంలో వివిధ ప్రాంతాల్లో మూడు ఆసుపత్రులు ఉండగా ఇది నాలుగవది. రాయపూర్, పల్వర్, ముంబైలలో చిన్న పిల్లల కార్డియాక్ ఆసుపత్రులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సిద్దిపేట జిల్లా కొండపాక శివారులో ఏర్పాటు చేయడం నాలుగవది.

100 పడకలు ఉండే విధంగా పవన నిర్మాణం పూర్తయింది మరో వంద పడకలు కూడా వేసుకునేట్టుగా ఏర్పాటు చేశారు. అలాగే ఆసుపత్రి సమీపంలో



రీసెర్చ్ సెంటర్‌ను కూడా ఏర్పాటు చేయనున్నారు. రోజుకు 10కి పైగా ఆపరేషన్లు చేసే విధంగా సౌకర్యాలను కల్పించారు. దేశంలో ఎక్కడి వారైనా ఇక్కడ ఆపరేషన్ ఉచితంగా చేసుకునే అవకాశం కల్పించారు.

ఆసుపత్రిలో అన్ని వసతులు

ఆస్పత్రిలో అన్ని ఏర్పాట్లు చేశారు. ఆపరేషన్ థియేటర్ క్యాతలాబ్, ఈకో పరికరాలతో పాటు ప్రత్యేకంగా ఓపిడి భవనం, వంద పడకల మరో భవనం ఏర్పాటయ్యాయి.ఆసుపత్రిలో సర్జికల్ టీం, క్రిటికల్ కేర్ యూనిట్, ప్రీఆపరేషన్ కోసం ప్రత్యేక గది ఏర్పాటు చేశారు. పేషెంట్ తో పాటు ఇద్దరు ఉండవచ్చు. వీరికి భోజన వసతి కూడా కల్పిస్తారు.

ఎమ్మెల్యే ఆదేశాలతో సమస్యలు తెలుసుకున్న మాజీ ఎంపీపీ

నవతెలంగాణ-మద్దూరు



ప్రభుత్వ జూనియర్ కళాశాలను మాజీ ఎంపీపీ బద్దిపడగ కృష్ణారెడ్డి గురువారం పరిశీలించి కళాలలో నెలకొన్న సమస్యలను తెలుసుకున్నారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి మాజీ ఎంపీపీ బద్దిపడగ కృష్ణారెడ్డికి కళాశాలలో నెలకొన్న సమస్యలను తెలుసుకోవాలని సూచించడంతో ఆయన కళాశాల ప్రిన్సిపల్ సురేష్ రెడ్డిని అడిగి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ కళాశాలలో 150 మంది విద్యార్థులు ఉన్నారని, విద్యార్థులకు ఒకటే టాయిలెట్ ఉండడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రహరి గోడ లేకపోవడంతో కళాశాలలో మందుబాబులు యదేచ్చగా మద్యం సేవిస్తూ మద్యం బాటిళ్లు పగలగొడుతున్నారని ప్రిన్సిపాల్ తన దృష్టికి తెచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ విషయాలను జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి దృష్టికి తీసుకు వెళ్తానని ఆయన తెలిపారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మరుగుదొడ్లు మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. కాంట్రాక్టర్ మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టకపోవడంతో నిధులు లాప్స్ అయినట్లు ఆయన తెలిపారు. కళాశాల సమస్యలు ఎమ్మెల్యే ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తారని, ఒకవేళ ప్రభుత్వం పట్టించుకోకపోతే ఎమ్మెల్యే తన సొంత ఖర్చులతో కళాశాలలో మరుగుదొడ్ల నిర్మాణం త్వరలో చేపడుతారని ఆయన తెలిపారు. ఆయన వెంట మద్దూరు సర్పంచ్ల ఫోరం మాజీ అధ్యక్షుడు వంగ భాస్కర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ గుజ్జుక సమ్మయ్య, నాయకులు నల్ల బాల్ రెడ్డి, బొద్దుల చంద్రమౌళి, తదితరులు ఉన్నారు.

భవన నిర్మాణ వెల్ఫేర్ బోర్డును కాపాడుకుందాం

- ప్రభుత్వమే సంక్షేమ పథకాలను అందివ్వాలి.
- 18న కలెక్టరేట్ ఎదుట ధర్నాను జయప్రదం చేయాలి

నవతెలంగాణ-కొండపాక



నాలుగు సంక్షేమ పథకాలను ఇన్సూరెన్స్ కంపెనీలకు టెండర్ల ద్వారా అప్పగించి ప్రభుత్వం తన బాధ్యత నుంచి తప్పుకోవాలనే నిర్ణయాన్ని ఉపసం హరించుకోవాలని బిల్డింగ్ అండ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ) జిల్లా ప్రధాన చొప్పరి రవికుమార్, సీఐటీయూ మండల కార్యదర్శి అమ్ముల బాల్ నర్సయ్యలు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కొండపాక మండలం వెలికట్ట అంబేద్కర్ విగ్రహం వద్ద వారు కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ భవన ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు అమలు చేస్తున్న ప్రమాద, సహజ మరణ, శాశ్వత, పాక్షిక అంగవైకల్యం వంటి నాలుగు సంక్షేమ పథకాలను ఇన్సూరెన్స్ కంపెనీలకు టెండర్ల ద్వారా అప్పగించేందుకు యత్నిస్తుందన్నారు. వెల్ఫేర్ బోర్డు అడ్వైజర్ కమిటీని నియమించి నిధులను దారి మళ్ళించకుండా కార్మికుల సంక్షేమం కోసమే ఖర్చు చేయాలన్నారు. ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వకుండా ప్రభుత్వమే కార్మికులకు సంక్షేమ పథకాలు అందివ్వాలని డిమాండ్ చేస్తూ 18న జిల్లా కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో 2009 నుంచి వెల్ఫేర్ బోర్డు ద్వారా 11 రకాల సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని ప్రస్తుతం ప్రమాద మరణానికి రూ.6,30,000లు సహజ మరణానికి రూ.1,30,000లు వివాహ, ప్రసూతి కానుకగా రూ.30,000ల చొప్పున తదితర సంక్షేమ పథకాలను అందిస్తున్నారని తెలిపారు. ఈ పథకాలను భవన నిర్మాణ కార్మికుల కొంత మేర రక్షణగా ఉండేదన్నారు. ఢిల్లీ పంజాబ్ హర్యానా తమిళనాడు కేరళ కర్ణాటక వంటి ఇతర రాష్ట్రాలలో భవననిర్మాణ కార్మికులకు అమలు చేస్తున్న పెన్షన్, పిల్లలకు స్కాలర్షిప్ల సొంత గృహవసతి వంటి పథకాలు అమలు చేస్తున్నా మన రాష్ట్ర ప్రభుత్వం నూతన సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టడంగాని ఉన్న సంక్షేమ పథకాలకు ఇస్తున్న నిధులు పెంచడం బోర్డులో నమోదు చేసుకున్న కార్మికులందరినీ రెన్యువల్ చేయడంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందుతుందన్నారు. నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు నుంచి అమలు చేస్తున్న శాశ్వతంగా వైకల్యం చెందినవారు. రూ.5లక్షలు పాక్షిక అంగవైకల్యం వారికి రూ.4 లక్షలు ఈ సంక్షేమ పథకాలను ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించి ప్రభుత్వం తన బాధ్యత నుంచి తప్పుకోవాలని చూస్తుందని మండిపడ్డారు. ఆగస్టు 21న ఇన్సూరెన్స్ కంపెనీలను టెండర్లకు ఆహ్వానించిందని, వెల్ఫేర్ బోర్డు అడ్వైజర్ కమిటీ లేదని లేనిపోని అసత్యలతో బోర్డు ఆమోదంతోనే టెండర్లను పిలుస్తున్నట్లు ప్రకటించిందన్నారు. ఈ నిర్ణయం వెల్ఫేర్ బోర్డు నిధులను బిల్డింగ్ కార్మికుల కాకుండా చేసి కాకులను కొట్టి గద్దలకు వేసే చందంగా ఉందన్నారు. భవన నిర్మాణ కార్మికుల కడుపు కొట్టి పెద్దపెద్ద ఇన్సూరెన్స్ కంపెనీలకు దోచిపెట్టడం కోసమే ప్రభుత్వం టెండర్లకు పిలుపునిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్మికులు మెరుగు కిష్టయ్య, అమ్ముల సాయిలు వ్య.కా.స. నాయకులు కొమురవెల్లి కనకయ్య, అమ్ముల యాదయ్య, ఉడుత చంద్రయ్య, పెరుగు మల్లేశం, అమ్ముల కనకయ్య, దొమ్మట ఎల్లయ్య, మేరుగు నర్సయ్య తదితరులు పాల్గొన్నారు. .

హ్యాండ్ బాల్ క్రీడాకారుల ఎంపిక

నవ తెలంగాణ- కొండపాక



కుకునూరు పల్లి మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర హ్యాండ్ బాల్ అసోసియేషన్ వారి ఆదేశాల మేరకు జెడ్పిహెచ్ఎస్ ఉన్నత పాఠశాల మైదానంలో ఉమ్మడి మెదక్ జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ అండర్ 15 బాలుర క్రీడాకారుల ఎంపికలు నిర్వహించారు. సంగారెడ్డి, మెదక్ , సిద్దిపేట జిల్లా నలుమూలల నుంచి సుమారు 160 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఇందులో ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 14 నుంచి 15 వరకు హనుమకొండలో జరిగే రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ సబ్ జూనియర్ పోటీలలో పాల్గొంటారని సిద్దిపేట హ్యాండ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి దామెర మల్లేశం, పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ క్యాతం రాజ్ కుమార్ లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బచ్చలి సత్తయ్య ,సిద్దిపేట జిల్లా హ్యాండ్ బాల్ శిక్షకుడు విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులు తుమ్మల కనకయ్య, సిద్దిపేట జిల్లా అధ్యక్షులు రామ్మోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి చింతకాయల స్వామి, హ్యాండ్ బాల్ నేషనల్ రిఫరీ ప్రేమ్ కుమార్, ఎన్ ఐ ఎస్ కోచ్ శేఖర్, సిద్దిపేట జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ మహిళా సెలక్షన్ కమిటీ కన్వీనర్ విశాల, వ్యాయామ ఉపాధ్యాయులు హరీష్, శేఖర్, చేతన్, క్రీడాకారులు శిక్షకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

నారాయణ పాఠశాలలో విద్యార్థులకు ఎన్నికలు

నవ తెలంగాణ-సిద్దిపేట



గ్రాండ్ పేరెంట్స్ డే...

సిద్దిపేటలోని నారాయణ స్కూల్‌లో ఎన్నికలు జరిపి విజేతలకు బాధ్యతలు అప్పగించి, నాయకత్వ లక్షణాల గురించి వివరించామని, పాఠశాలలో జరిగే కార్యక్రమాలు పిల్లల అభివృద్ధికి ఎలా తోడ్పడతాయో వివరించినట్లు ఏజీఎం చైతన్య రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు విభిన్న నృత్యాలతో అలరించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ తెలంగాణ జోన్ జీఎం గోపాల్ రెడ్డి, ఏజీఎం చైతన్య రావు, ఆర్ఐ సత్యం రావు, ప్రిన్సిపల్ రమ్య, ఈ ఛాన్స్ కోఆర్డినేటర్ శ్రావణి, డీన్ పరశురాం, వైస్ ప్రిన్సిపల్ షబానా, ఏవో రమేష్ ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గురువారం గ్రాండ్ పేరెంట్స్ డే నిర్వహించినట్లు పాఠశాల ప్రిన్సిపల్ రమ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల గ్రాండ్ పేరెంట్స్ నానమ్మ తాతయ్య అమ్మమ్మ, తాతయ్యలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారని తెలిపారు. వారికి ఆట, పాటల పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. చిన్న కుటుంబం ఏర్పాటుతో వృద్ధుల నిరాదరణకు గురవుతున్న సందర్భంగా గ్రాండ్ పేరెంట్స్ సెలబ్రేషన్ నిర్వహించి, వారి విలువలను విద్యార్థులకు వివరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జయం గోపాల్ రెడ్డి, ఏజీఎం చైతన్యరావు, ఆర్ఐ సత్యం రావు, ఈ కిడ్స్ కోఆర్డినేటర్ రవళి ప్రియ, డీన్ పరశురాం, వైస్ ప్రిన్సిపల్ షబానా ఉపాధ్యాయ బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

చేనేత రంగాన్ని బతికిస్తాం

- మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి

నవతెలంగాణ-గజ్వేల్



చేనేత రంగాన్ని బతికిస్తామని, ఆర్థికంగా సామాజికంగా బలోపేతం చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చినట్లు మాజీ ఎమ్మెల్యే, సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు తూముకుంట నర్సారెడ్డి అన్నారు. గురువారం చేనేత సహకార సంఘం పట్టణంలో గణేశుని ఏర్పాటు చేయగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన నర్సారెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో చేనేత రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసిందని ఆయన గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేనేత రంగాన్ని కార్మికులను ఆదుకునేందుకు ముందుకు వస్తుందన్నారు. చేనేత రంగంపై ఆధారపడ్డ పద్మశాలి కుటుంబాలకు సామాజికంగా ఆర్థికంగా కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని ఆయన చెప్పారు. ఒకప్పుడు గజ్వేల్‌లో చేనేత సహకార సంఘం అభివృద్ధి చెందిందని తిరిగి కాంగ్రెస్ హయాంలో మరింత అభివృద్ధి చెందేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందదన్నారు. అనంతరం మున్సిపల్ మాజీ చైర్మన్ గాడి పల్లి భాస్కర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేనేత రంగంపై నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో పద్మశాలీలు చేనేత రంగం పూర్తిగా నిర్వీరమైందని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు నక్క రాములు గౌడ్, సురేష్, సుభాష్ చంద్రబోస్, గుంటుక శ్రీనివాస్, పద్మశాలి సంఘం నాయకులు రాజారాం, సంఘం నాయకులు శ్రీనివాస్, నేత నాగరాజు, గాడి పల్లి అనూఫ్, ప్రేమ్ కుమార్, గుండు మల్లేశం, బాలచంద్రం, ఎల్లం రాజు, చంద్రం, బలరాం, నరసింహులు, శ్రీనివాస్, పూల సత్యం, రమేష్ ,శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

- ఐదుగురు అరెస్ట్, రూ.5 వేల నగదు,5 ఫోన్లు రికవరీ

నవతెలంగాణ-గజ్వేల్ రూరల్



చట్ట వ్యతిరేకమైన కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు హెచ్చరించారు. గురువారం గజ్వేల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సంగుపల్లి గ్రామ శివారులో ఉన్న కుర్మ సంఘం బిల్డింగులో పేకాట ఆడుతున్న వారిని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నమ్మదగిన సమాచారంతో సంగుపల్లి పేకాట స్థావరంపై పోలీసులతో కలిసి రైడ్ చేసి నిందితులను పట్టుకున్నామన్నారు. వారి వద్ద నుంచి రూ.5,100 నగదు, 05 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నమన్నారు. పేకాట ఆడిన వారిలో సంగు పల్లి గ్రామానికి చెందిన బక్కోళ్ల కుమార్,గజ్జల మల్లేష్,బక్కోళ్ల రమేష్, ఎర్రబెరి ముత్యాలు, పెద్దాపుల్ల ప్రశాంత్‌లు ఉన్నారన్నారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నటు సమాచారం ఉంటే వెంటనే సిద్దిపేట టాస్క్ ఫోర్స్ అధికారుల నెంబర్లు 8712667445, 8712667446, 8712667447 లకు సమాచారం అందించాలని సూచించారు. సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టాస్క్ ఫోర్స్, గజ్వేల్ పోలీసులు, తదితరులు ఉన్నారు

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

- అట్టహాసంగా ప్రారంభమైన ఎస్‌జిఎఫ్ క్రీడలు

నవతెలంగాణ-కొండపాక



పాఠశాల స్థాయి నుంచే చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించాలని ఎంపీడీవో వెంకటేశ్వర్లు, తహశీల్దార్ దిలీప్ నాయక్, ఎంఈఓ శ్రీనివాసరెడ్డి విద్యార్థులకు సూచించారు. కొండపాకలో గురువారం ఎస్‌జిఎఫ్ క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. పోటీలను ప్రారంభించిన వారు మాట్లాడుతూ క్రీడలు మానసిక ఆరోగ్యం కలిగిస్తాయన్నారు. చదువుతూనే క్రీడలకు కూడా ప్రాధాన్యతను ఇవ్వాలని తెలిపారు. విద్యార్థులు రోజువారి దైనందిక జీవితంలో క్రీడలు భాగం చేసుకోవాలన్నారు. క్రీడలతో ఎంతటి క్లిష్ట పరిస్థితులనైనా ఎదుర్కొనే శక్తినిస్తాయన్నారు. మొబైల్ ఫోన్లకు దూరంగా ఉండాలన్నారు. అండర్ 14 అండర్ 17 క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో ఎంఎన్ఓ విఠల్, కాంప్లెక్స్ హెచ్ఎం శ్రీనివాస్, రామచంద్రం, పిడి భాస్కర్ రెడ్డి, ఉప్పలయ్య, శుభాకర్ రెడ్డి, బాబు, రాధిక, పద్మ ఎంఐఎస్ సురేందర్, సిఆర్పి బాలకిషన్ వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా రేణుక

నవతెలంగాణ-సిద్దిపేట



కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శిగా తౌడబోయిన రేణుకను నియమిస్తూ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు తూముకుంట నర్సారెడ్డి నియామక పత్రాన్ని గురువారం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించినందుకు నర్సారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పదవి ఇచ్చేందుకు తోడ్పడిన, మంత్రులు కొండ సురేఖ, పొన్నం ప్రభాకర్, దామోదర్ రాజ నరసింహ, సిద్దిపేట నియోజికవర్గ ఇన్చార్జ్ పూజల హరికృష్ణలకు ధన్యవాదాలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి జిల్లా ప్రధాన కార్యదర్శి పదవి ఇచ్చినందుకు, పార్టీని బలోపేతం చేయడానికి అహర్నిశలు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు అత్తు, ఫయాజ్, తదితరులు పాల్గొన్నారు.

కార్గో సేవలను వినియోగించుకోవాలి

- డిపో మేనేజర్ జీ.వీ.ఎన్ ఎస్ పవన్

నవ తెలంగాణ-కొండపాక



కుకునూరు పల్లి మండల ప్రజలు కార్గో సేవలను వినియోగించుకోవాలని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ డిపో మేనేజర్ పవన్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలో బస్టాండ్ ఎదురుగా తెలంగాణ ఆర్టిసి కార్గో కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఆర్టీసీ ద్వారా వేగంగా, భద్రత ప్రమాణాలతో తక్కువ ధరకు కార్గో సేవలను ప్రజలకు అందిస్తున్నామని తెలిపారు. కుకునూరు పల్లిలో కార్గో కేంద్రం లేకపోవడంతో ఇటు గజ్వేల్ అటు సిద్దిపేటకు వెళ్లేవారని, కానీ ఇప్పుడు మండల కేంద్రంలోనే కార్గో కేంద్రాన్ని ప్రారంభించడం జరిగిందని తెలిపారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు వినియోగించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సందీప్, షఫీ పాషా, భాస్కర్, అరవింద్,శంకర్. స్వామి,రాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మూల నక్షత్ర విశేష పూజలు

నవతెలంగాణ-వర్గల్



ప్రసిద్ధ వర్గల్ శ్రీ విద్యాధరి క్షేత్రంలో గురువారం మూలా నక్షత్ర విశేష పూజలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా తెల్లవారుజామున ఆలయ వ్యవస్థాపక చైర్మన్, బ్రహ్మశ్రీ యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి మూల మహోత్సవానికి వేదపండితుల మంత్రోశ్చరణల మధ్య అంకురార్పణ చేశారు. అనంతరం అమ్మవారికి విశేష పంచామృతాభిషేకం, చండీ హోమం, లక్షపుష్పార్చన, ప్రత్యేక పూజలు తదితర కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ పర్వదినాన్ని పురస్కరించుకొని క్షేత్రానికి తరలివచ్చిన భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలతో పాటు మహాప్రసాదం అందజేశారు.

కామ్రేడ్ ఏచూరితో జ్ఞాపకాలు

నవ తెలంగాణ-సిద్దిపేట

2022 సెప్టెంబర్ 17న జనగామలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవ సభ సందర్భంగా సీపీఐ(ఎం) అఖిల భారత ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరితో సీపీఐ(ఎం) సిద్దిపేట జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాళ్ల బండి శశిధర్ కలిసిన సందర్భంగా జ్ఞాపకాలు.



అక్రమ వెంచర్ల తొలగింపు



నవతెలంగాణ-సిద్దిపేట

మున్సిపల్ కమిషనర్, సుడా వైస్ చైర్మెన్ అశ్రిత్ కుమార్ ఆదేశాల మేరకు గురువారం సిద్దిపేట అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ పరిధిలో ఉన్న నాంచార్ పల్లి గ్రామపంచాయతీలో వేసిన అక్రమ వెంచర్ హద్దురాళ్ళను డీపీఓ దేవరాజ్ సిబ్బందితో తొలగింప చేశారు. పొన్నాల ఊర చెరువు పక్కన గల ఫుల్ ట్యాంక్ లెవల్ పరిధిలో అక్రమ వెంచర్‌లోని ప్రహరీ గోడను తొలగించారు. సిద్దిపేట పట్టణంలో, సుడా పరిధిలో బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్ లలో ఎలాంటి నిర్మాణాలు గాని, వెంచర్లుగాని వేయకూడదని, ఎవరైనా వేసినట్లైతే తప్పకుండా వాటిపై చర్యలు తీసుకుంటామన్నారు. అంతేకాకుండా సిద్దిపేట పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న గృహ యజమానులు తప్పనిసరిగా అనుమతులు తీసుకొని నిర్మించాలని, నిబంధనలకు అనుగుణంగా నిర్మించాలని సూచించారు.

మార్క్సిస్టు మేధావి సీతారాం ఏచూరికి ఘన నివాళి

- కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటు
- సీపీఐ(ఎం) సిద్దిపేట జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాళ్ల బండి శశిధర్
- సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన నాయకులు

నవ తెలంగాణ-సిద్దిపేట అర్బన్

సీపీఐ(ఎం) అఖిల భారత ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ మార్క్సిస్టు మేధావి సీతారాం ఏచూరి మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి, వివిధ ప్రజల పోరాటాలకు తీరనిలోటని సీపీఐ(ఎం) సిద్దిపేట జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాళ్లబండి శశిధర్ అన్నారు. గురువారం ఉదయం 11 గంటలకు ఢిల్లీలోని ఎయిమ్స్ లో తీవ్ర అనారోగ్యంతో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) సిద్దిపేట జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సంతాప సభలో సీతారామ్ ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి సీపీఐ(ఎం) నాయకులు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంతాప సూచకంగా మౌనం పాటించారు. అనంతరం శశిధర్ మాట్లాడుతూ సీతారాం ఏచూరి చిన్ననాటి నుంచే వామపక్ష భావజాలాన్ని పునికిపుచ్చుకొని జీవిత చరమాంకం వరకు దేశంలో పీడిత ప్రజల రాజ్యం రావాలని కష్టజీవుల పక్షాన ఉద్యమించిన గొప్ప మార్క్సిస్టు మేధావి అని కొనియాడారు. ఆయన జీవించిన కాలమంతా కష్టజీవుల విముక్తి కోసమే కృషి చేశారని దేశ రాజకీయాల్లో ప్రముఖ పాత్ర పోషించారని, ఎమర్జెన్సీ సమయంలో తీవ్ర నిర్బంధాన్ని భయాందోళనలను నిర్భయంగా ఎదుర్కొన్న గొప్ప విప్లవ నేత అని అన్నారు. దేశంలో విద్యార్థి ఉద్యమాల్లో పాల్గొన్న ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడని భారత రాజకీయాలలో క్రియాశీలక పాత్ర పోషించిన మహా నాయకుడన్నారు. సీపీఐ(ఎం) అఖిల భారత ప్రధాన కార్యదర్శిగా సమర్థవంతంగా ఆదర్శవంతమైన జీవితం గడిపారని తెలిపారు. ఆయన మరణం ప్రజా ఉద్యమాలకు తీరనిలోటన్నారు. సీతారాం ఏచూరి పోరాట స్ఫూర్తితో దేశంలో విప్లవ సాధన కోసం ఆయన కలలు కన్న రాజ్యం సాధించడం కోసం చేసే పోరాటం ద్వారానే ఆయనకు ఘన నివాళులు అర్పించిన వారమవుతామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు చొప్పరి రవికుమార్, జాలిగపు శిరీష, దాసరి ప్రశాంత్, నాయకులు కొండం సంజీవ్, చెప్యాల బాలమని, చెప్యాల సంతోష్, బత్తుల అభినవ్ తదితరులు పాల్గొన్నారు.



- సీతారాం ఏచూరి మరణం దేశ రాజకీయాల్లో విషాదం
- ప్రగాఢ సంతాపం వ్యక్తం చేసిన సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు గడిపె మల్లేశ్

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

సీతారం ఏచూరి మృతితో కేవలం కమ్యూనిస్టు పార్టీ శ్రేణుల్లోనే కాకుండా దేశ రాజకీయాల్లోనే విషాదం నెలకొందని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు గడిపే మల్లేష్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గడిపె మల్లేష్ మాట్లాడుతూ నమ్మిన సిద్ధాంతం కోసం కడవరకు క్రియాశీల కార్యకర్త స్థాయి నుంచి సీపీఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శిగా, మాజీ రాజ్యసభ సభ్యుడుగా సీతారాం ఏచూరి ప్రజా సేవలు అందించారన్నారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఢిల్లీ ఎయిమ్స్‌లో చేరి చికిత్స పొందుతూ గురువారం మధ్యాహ్నం పరిస్థితి విషమించి తుది శ్వాస విడిచారని పేర్కొన్నారు. ఆయన మరణం వామపక్ష కమ్యూనిస్టు పార్టీలకు భారత దేశ ప్రజలకు తీరని లోటన్నారు. వారి కుటుంబ సభ్యులకు గడిపె మల్లేశ్‌తో పాటు సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు అయిలేని సంజీవరెడ్డి, కొహెడ కొమురయ్య, పిట్టల బాలయ్య, ఎగ్గోజు సుదర్శన్ చారి, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు జనగాం రాజు కుమార్, భారత జాతీయ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గూడ పద్మ, పిల్లి రజిని, సిపిఐ మండల నాయకులు అయిలేని మల్లారెడ్డి, కాల్వల ఎల్లయ్య, మేకల విజయ, కొమ్ముల జెమున, దొంతరవేనిరజిత, నేలవేణి స్వప్న, ఇరుగు సంధ్య, పొన్నాల స్వప్న, ఎండి అక్బర్ ప్రగాఢ సానుభూతి ,సంతాపం ప్రకటించారు.



ఏచూరి మరణం కమ్యూనిస్టు, ప్రజాస్వామ్య ఉద్యమాలకు తీరని లోటు

- సందబోయిన ఎల్లయ్య, సీపీఐ (ఎం) జిల్లా కార్యదర్శి సభ్యులు

నవ తెలంగాణ- గజ్వేల్

సీపీఐ (ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం కమ్యూనిస్టు, ప్రజాస్వామ్య ఉద్యమాలకు తీరని లోటని సీపీఐ (ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సందబోయిన ఎల్లయ్య అన్నారు. గురువారం గజ్వేల్ పార్టీ కార్యాలయంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలవేసి సంతాపం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏచూరి విద్యార్థి ఉద్యమం ఎస్ఎఫ్ఐ నుంచి సీపీఐ (ఎం) పార్టీ ప్రధాన కార్యదర్శి వరకు ఎదిగారన్నారు. రాజ్యసభకు రెండు దఫాలుగా ఎన్నిక కావడం జరిగిందని పార్లమెంట్లో అనేక సవరణలు ప్రతిపాదన చేసి ఓటింగ్ పెట్టిన నెగ్గిందన్నారు భారత పార్లమెంటు బృందానికి నాయకత్వం వహించి ఐక్యరాజ్యసమితిలో మూడు సార్లు ప్రసంగించారన్నారు. ఉన్నత విద్యావంతుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి, మేధావి అని 14 భాషలు అనర్గళంగా మాట్లాడగలిగే వారన్నారు. ప్రజా ఉద్యమాలు ఎక్కడ జరిగినా ఉద్యమాలకు అండగా నిలబడే వారన్నారు. పార్టీ అగ్ర నాయకులు సుందరయ్యతో జ్యోతిబసుతో హరి కిషన్ సింగ్ సుర్జిత్ ఏకే గోపాలన్ వంటి అగ్ర నాయకులతో ఉంటూ ప్రజా సమస్యలపై ప్రభుత్వ విధానాలపై అవగాహన పెంచుకున్నారన్నారు. జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ అధ్యక్షునిగా మూడుసార్లు ఎన్నికయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు వెంకట చారి, అఫ్జల్, సమీర్ , అశోక్ తదితరులు పాల్గొన్నారు.



ఏచూరి మరణం వామపక్ష ఉద్యమానికి తీరని లోటు

- మంద పవన్, సీపీఐ జిల్లా కార్యదర్శి.

నవ తెలంగాణ-సిద్దిపేట అర్బన్

సీపీఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మరణించడం చాలా బాధాకరమని, ఆయన మరణం కమ్యూనిస్టు పార్టీలకు, కమ్యూనిస్టు ఉద్యమానికి తీరనిలోటని, ఆయన మరణం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందనని సీపీఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్ అన్నారు. సీతారాం ఏచూరి మరణం పట్ల సంతాపం ప్రకటిస్తూ సీతారాం ఏచూరి విద్యార్థి దశ నుంచి వామపక్ష ఉద్యమాల ఆకర్షితులై సీపీఎం పార్టీ అనుబంధ విద్యార్థి సంఘం జాతీయ కార్యదర్శిగా పని చేసారన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఆయన అనేక ఉద్యమాలు చేసి అంచెలంచెలుగా ఎదుగుతూ జాతీయ పార్టీ కార్యదర్శిగా 3 దఫాలుగా పని చేశారని, ఆయన పోరాటాలు మరవలేనివని పవన్ గుర్తు చేశారు..



భారీ వర్షాల వల్ల నష్టపోయిన పంటలను పరిశీలించి రైతులను ఆదుకోవాలి

- వరదలను కేంద్ర ప్రభుత్వం జాతీయ విపత్తుగా ప్రకటించాలి
- సీపీఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్ డిమాండ్
- సీపీఐ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ముందు ధర్నా

నవ తెలంగాణ-సిద్దిపేట అర్బన్

భారీ వర్షాల వల్ల పంటలు నష్ట పోయిన రైతులను ఆదుకోవాలని, వరదలను కేంద్ర ప్రభుత్వం జాతీయ విపత్తుగా ప్రకటించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఐ రాష్ట్ర సమితి పిలుపుమేరకు గురువారం సిద్దిపేట జిల్లా కలెక్టరేట్ ఎదుట సీపీఐ సిద్దిపేట జిల్లా సమితి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మంద పవన్ మాట్లాడుతూ ఇటీవల కాలంలో జిల్లాలో భారీ వర్షాలు కురిసి తీవ్రమైన పంటల నష్టం జరిగిందని, జిల్లా వ్యాప్తంగా అనేక చెరువులు, కుంటలు నిండి కొన్ని చోట్ల చెరువులకు,కుంటలకు గండ్లు పడ్డాయని. తారు రోడ్లు,మట్టి రోడ్లు తెగిపోయాయని, రోడ్లన్నీ తెగిపోవడం మూలంగా అనేక గ్రామాలకు రాక, పోకలు నిలిచిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. గ్రామాల్లో, పట్టణాల్లో ఇండ్లు కూలిపోవడంతో పాటు వేలాది ఎకరాల పంట పొలాలు నీట మునిగాయన్నారు. ఎన్నో వ్యాయ, ప్రయాసలకు ఓర్చి అప్పులు తెచ్చుకొని పంటలు వేస్తే భారీ వర్షాల మూలంగా వరి, మొక్కజొన్న, పత్తి, మిర్చి ఇతర పంటలన్నీ దెబ్బతిని రైతులకు అపారమైన నష్టం జరిగిందని, రాష్ట్రంలో,జిల్లాల్లో ఇటీవల కురిసిన భారీ వర్షాలు వరదల కారణంగా సంభవించిన అపారమైన నష్టాన్ని అంచనా వేసేందుకు కేంద్ర ప్రభుత్వ అధికారుల బృందం తక్షణమే రాష్ట్రంలో పర్యటించి, వరదలను జాతీయ విపత్తుగా ప్రకటించి రాష్ట్రానికి రూ.10 వేల కోట్లను విడుదల చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని పవన్ డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జాగిరి సత్యనారాయణ, బట్టు దయానంద రెడ్డి, యెడల వనేష్,అందే అశోక్, కిష్టపురం లక్ష్మణ్,జిల్లా కౌన్సిల్ సభ్యులు బన్సీలాల్, కొమ్ముల భాస్కర్,శివలింగు కృష్ణ,ఈరి భూమయ్య,పిట్ల మల్లేశం, కర్నాల చంద్రం,నర్సింహారెడ్డి,మంద శ్రీనివాస్, జేరిపోతుల జనార్దన్,సంగెం మధు,రామగాళ్ల నరేష్, మిట్టపల్లి సుధాకర్,మహిళ సమాఖ్య నాయకురాళ్లు యాద పద్మ,పిల్లి రజిని,జంగ విజయ,నాయకులు మాడిశెట్టి శ్రీధర్, వేల్పుల ప్రసన్నకుమార్,గాంభీరపు మధు తదితరులు పాల్గొన్నారు..



ఎర్ర జెండా పోరాట ఫలితమే

- భూమి, భుక్తి, వెట్టి చాకిరి విముక్తి
- అమరవీరుల స్ఫూర్తితో ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలి
- ఆవాస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ.అబ్బాస్
- దుబ్బాకలో ఘనంగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరవీరుల సంస్మరణ సభ



నవ తెలంగాణ-దుబ్బాక

ఎర్ర జెండా పోరాట ఫలితంగానే తెలంగాణలో భూమి, భుక్తి, వెట్టి చాకిరి విముక్తి కలిగిందని.. వారి పోరాటపటిమను స్ఫూర్తిగా తీసుకుని కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని, దీనికి ఎర్రజెండా అండగా ఉంటుందని ఆవాస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ.అబ్బాస్ అన్నారు. బుధవారం సిద్దిపేట జిల్లా దుబ్బాక పట్టణ కేంద్రంలోని వైశ్య భవన్‌లో 'ప్రజా సంఘాల' ఆధ్వర్యంలో నిర్వహించిన "తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరవీరుల సంస్మరణ సభ"కు ఆవాస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అబ్బాస్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మహత్తర వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో అమరులైన వారి అమరత్వాన్ని స్మరిస్తూ ఆ పోరాట వారసత్వాన్ని పునికి పుచ్చుకుని హక్కుల సాధన కోసం భవిష్యత్ పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. 1946 -51 మధ్య కాలంలో కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో నైజాం రజాకార్లు, దొరలు, భూస్వాములు, జాగీర్ దార్లకు వ్యతిరేకంగా రైతాంగ పోరాటం సాగిందని గుర్తు చేశారు. ఈ పోరాటం ప్రపంచ చరిత్రలో గొప్ప ప్రజా పోరాటంగా లిఖించబడిందని, ఈ పోరాట స్ఫూర్తితో దేశమంతా రైతాంగం, పేదలు, అణగారిన వర్గాల ప్రజలు వారివారి ప్రాంతాలలో పోరాటాలు గావించి విజయం సాధించి ప్రజల్ని విముక్తి చేశారని కొనియాడారు. తెలంగాణ ప్రాంతంలో మీర్ ఉస్మాన్ అలీఖాన్, ఖాసీం రజ్వీ సైన్యాలకు, విస్నూర్ దేశముఖ్, రాపాక రాంచంద్రారెడ్డి, బాబుదొర,జన్నారెడ్డి ప్రతాపరెడ్డి లాంటి దొరలు భూస్వాములకు వ్యతిరేకంగా దొడ్డి కొమురయ్య,చిట్యాల (చాకలి) అయిలమ్మ, షేక్ బందగీ,ఏసురెడ్డి,నర్సింహ్మారెడ్డి, భీంరెడ్డి నర్సింహ్మారెడ్డి,మల్లు స్వరాజ్యం, షోయబుల్లాఖాన్, కాచం కృష్ణమూర్తి, నల్లా నర్సింహ్మలు, రావి నారాయణరెడ్డి, కొత్త ముకుందరెడ్డి, కేవల్ కిషన్ లాంటి ఎందరో త్యాగధనులు పోరాడారని తెలిపారు. భారత దేశం వలసదారుల కబంధ హస్తాలలో నలిగిపోయి 1947 ఆగష్టు 15న స్వాతంత్ర్యం వచ్చినా కానీ హైద్రాబాద్ సంస్థానం నిజాం నవాబు నిరంకుశ పాలనలో ఉండేదని ఆవేదన వ్యక్తం చేశారు.అప్పటి తెలంగాణలోని గ్రామాల్లో వెట్టి చాకిరి,భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేఖంగా,బాంచెన్ దొర నీకాల్లు మొక్తా అనే రోజులు పోవాలని,దున్నేవాడికే భూమి కావాలని సాగిన మహత్తర వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో 4500 మంది కమ్యూనిస్టులు,ప్రజలు ప్రాణాలర్పించారని కొనియాడారు. ఆంధ్ర మహాసభ కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో సాగిన రైతాంగ సాయుధ పోరాటం వెట్టి చాకిరి, జాగీర్దార్లు,జమీందార్లు,భూస్వాముల దోపిడి, దౌర్జన్యాల నుంచి ప్రజలను విముక్తి చేసిందని వెల్లడించారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఆముదాల మల్లా రెడ్డి మాట్లాడుతూ సిద్దిపేట జిల్లాలో దొరలు, భూస్వాములు, జాగీర్దార్లు చేస్తున్న దోపిడి, పీడన, అణిచివేత, ఆగడాలకు వ్యతిరేకంగా పోరాటాలు జరిగాయని గుర్తు చేశారు. మద్దూర్, దూల్మిట్ట, బైరాన్ పల్లి, హుస్నాబాద్, చేర్యాల, కొమురవెల్లి, గజ్వేల్, దుబ్బాక, సిద్దిపేటతో పాటు జిల్లాలోని అనేక ప్రాంతాల్లో కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో వీరోచితమైన పోరాటాలు జరిగాయన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపాలస్వామి, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు సింగిరెడ్డి నవీన, ఎన్ పీఆర్ డీ వికలాంగుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షులు ఎండీ.సాజిద్, ప్రజాసంఘాల నాయకులు పద్మ, లక్ష్మి, చంద్రారెడ్డి, కొంపల్లి భాస్కర్, ప్రశాంత్, మహేష్, భాగ్యలక్ష్మి, మంజుల, భారతి, రాజు, ప్రభాకర్, పలు గ్రామాల, మండలాల కార్మికులు, అభిమానులు పాల్గొన్నారు.



పోషక ఆహారం గర్భవతులు, బాలింతలు ఎంతో మేలు

నవతెలంగాణ-తొగుట

పోషక ఆహారం గర్భవతులు, బాలింతలకు ఎంతో మేలని అంగన్వాడీ టీచర్లు సూచించారు. గురు వారం దుబ్బాక సెక్టార్ పరిధిలోని గుడికందుల అంగన్వాడీ కేంద్రంలో పోషక మసోత్సవాల సందర్భంగా గర్భవతులకు, బాలింతలకు పోషక ఆహారం గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పోషక మాసోత్సవాలు నిర్వహిస్తున్నారన్నారు. గర్భవతులు, బాలింతలు బలమైన ఆహారం తీసుకోవడం వల్ల పుట్టబోయే శిశువు ఆరోగ్యంగా జన్మిస్తారని చెప్పారు. ప్రతి అంగన్వాడీ కేంద్రంలో పోషక ఆహారం అందిస్తారని తెలిపారు. ఇలాంటి పోషక ఆహారం గర్భిణీలు, బాలంతలు, చిన్న పిల్లలు సంపూర్ణ ఆరోగ్యం లనిస్తుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ తారా, పంచాయతీ కార్యదర్శి రజిని, అంగన్వాడీ సుపర్వేజర్ ఆమ్ములు, అంగన్వాడీ టీచర్స్ టి తార, సి హెచ్ వనజ, వీణ, జ్యోతి, స్వప్న, దేవమ్మా జ్యోతి, మమత, రేణుక, రజిని, విజయ, ఆశా కార్యకర్త లక్ష్మి,జ్యోతి, ఆయాలు, గర్భిణీలు, బాలం తలు, చిన్న పిల్లలు తదితరులు ఉన్నారు.



ఏచూరి మృతి పార్టీకి తీరని లోటు



నవ తెలంగాణ- గజ్వేల్

సీపీఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి మరణం చాలా బాధాకరమని, ఆయన మృతి పేదలకు, కార్మిక, కర్షక వర్గాలకు వామపక్ష ఉద్యమాలకు తీరని లోటని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బండ్ల స్వామి అన్నారు. తన రాజకీయ జీవితాన్ని ప్రజా ఉద్యమాలకే అంకితం చేసిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. స్వశక్తితో విద్యార్థి దశ నుంచి ఉద్యమాలలో పాల్గొంటూ జాతీయస్థాయి నేతగా ఎదిగారన్నారు. ఆయన వేసే ప్రతి అడుగు పేదలు, బాధితులు, కార్మిక, కర్షక వర్గాల పక్షాన వేసేవారన్నారు. అతను రాజ్యసభ సభ్యుడిగా ఉత్తమ పార్లమెంటేరియన్‌గా పురస్కారాన్ని అందుకున్నారన్నారు. విదేశాంగ విధానంపై, ఆర్థిక అంశాలపై, పారిశ్రామిక వాణిజ్య విధానాలపై తన ఆలోచనలకు అక్షర రూపంలో ఎన్నో వ్యాసాలు ఈ సమాజానికి అందించిన గొప్ప వ్యక్తి అని అన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని సంతాపం తెలుపుతూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

కామ్రేడ్ సీతారాం ఏచూరి మరణం సీపీఐ(ఎం) ఉద్యమానికి తీరని లోటు

- సీపీఐ(ఎం)జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి

నవతెలంగాణ-చేర్యాల

సీపీఐ (ఎం)జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి మరణం సీపీఐ(ఎం) ఉద్యమానికి తీరని లోటని సీపీఐ(ఎం) సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి అన్నారు. గురువారం చేర్యాల మండల కేంద్రంలోని పాత బస్ స్టాండ్ వద్ద సీతారాం ఏచూరి చిత్ర పటానికి పూల మాల వేసి నివాళు లర్పించారు. అనంతరం మల్లారెడ్డి మాట్లాడుతూ ఏచూరి మరణం భారత ప్రజాతంత్ర ఉద్యమానికి తీరనిలోటన్నారు. భారత ప్రజానీకానికి శ్రామిక వర్గానికి కామ్రేడ్ సీతారాం ఏచూరి అందించిన సేవలు చిరస్మరణీయమని, విద్యార్థి దశ నుంచి నేటి వరకు విరామం ఎరగక విప్లవ సాధన కోసం అనేక ఉద్యమాల రూపకల్పన చేస్తూ ప్రత్యక్ష పోరాటాల్లో భాగస్వాములై సమ సమాజ స్థాపన కోసం సాగిన ఏచూరి ప్రస్థానం చిరస్మరణీయమన్నారు. ఆయన ఆశయ సాధన కోసం పార్టీ కార్యకర్తలు అలుపెరుగని పోరాటాలు, ఉద్యమాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ చేర్యాల మండల కార్యదర్శి కొంగరి వెంకట మావో, చేర్యాల పట్టణ కార్యదర్శి రాళ్ల బండి నాగరాజు, మద్దూరు మండల కార్యదర్శి ఆలేటి యాదగిరి, జిల్లా కమిటీ సభ్యులు బండకింది అరుణ్ కుమార్, నాయకులు పోలోజు శ్రీహరి ముస్త్యాల ప్రభాకర్, బోయిని మల్లేశం, రాళ్ల బండి భాస్కర్, ఎర్రబోసు అశోక్, ఇప్పకాయల శోభ, మేర్గోజు సత్యనారాయణ, రామచంద్రం, బొంగోని భాస్కర్, బండ కింది బాల నారాయణ, రాళ్ల బండి చందు, తాటికొండ రవీంద్ర చారి, శ్రీనివాస్, పండుగ యాదగిరి, రంజిత్ రెడ్డి, రాకేష్ రెడ్డి, కొంగరి శ్రీధర్,నూర్బీ తదితరులు పాల్గొన్నారు.



ఎస్టీయూ సభ్యత్వ నమోదు



నవతెలంగాణ-బెజ్జంకి

మండల కేంద్రంతో పాటు దాచారం, గుగ్గీల్ల, గాగీల్లాపూర్, తోటపల్లి, వీరాపూర్, బేగంపేట, వడ్లూరు ప్రాథమిక, ప్రభుత్వోన్నత పాఠశాలలో ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మ్యాడ శ్రీధర్ అధ్వర్యంలో సభ్యత్వ నమోదు గురువారం చేపట్టారు. ఉద్యోగులకు డీఏలను వెంటనే మంజూరు చేయాలని ఎస్టీయూ జిల్లా కార్యదర్శి శ్రీధర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా ఆర్థిక కార్యదర్శి వడ్లకొండ శ్రీనివాస్, బెజ్జంకి మండల ప్రధాన కార్యదర్శి రామంచ రవీందర్, మండల ఉపాధ్యక్షులు సతీష్ కుమార్, చేర్యాల అధ్యక్షుడూ కంతుల రాములు, జిల్లా బాధ్యులు శ్రీనివాస్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరి మరణం దేశానికి తీరని లోటు

- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దాసరి ప్రశాంత్

నవ తెలంగాణ-సిద్దిపేట

ఎస్ఎఫ్ఐ పూర్వ జాతీయ అధ్యక్షులు సీతారాం ఏచూరి మరణం దేశానికి తీరని లోటని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దాసరి ప్రశాంత్ అన్నారు. ఎస్ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా కమిటీ ఏచూరి మరణానికి సంతాపాన్ని తెలిపి, పూలమాల వేసి, నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1974లో ఎస్ఎఫ్ఐ లో చేరిన సీతారాం ఏచూరి జేఎన్ యులో చేరి యూనివర్శిటీ సమస్యలపై పోరాడారని, ఎమర్జన్సీ కాలంలో విద్యార్థి హక్కులపై పోరాడుతూనే, నాటి ప్రధాని ఇందిరగాంధి ముందు ధైర్యంగా నిలబడి కొట్లాడారని అన్నారు. 1977-78 వరుసగా 3 సార్లు జే ఎన్ యు విద్యార్థి సంఘం అధ్యక్షుడిగా పనిచేశారని గుర్తు చేశారు. 1984లో జాతీయ అధ్యక్షులుగా పనిచేశారని తెలిపారు. విద్యార్థి సంఘంలో పనిచేస్తున్న సమయంలో అనేక ఉద్యమాలు, పోరాటాల గురించి అధ్యయనం చేస్తూనే, ప్రపంచ దేశాలలో కమ్యూనిస్టు, కార్మిక ఉద్యమాలకు అండగా నిలిచారని అన్నారు. దేశంలో అణగారిన వర్గాలకు రాజ్యాంగం ఇచ్చిన హక్కులు, సామాజిక తరగతుల హక్కులకై అలుపెరగని ఉద్యమాలు చేశారని, పార్లమెంటులో హక్కుల కోసం, రాజ్యాంగ రక్షణ కోసం పోరాడారని కొనియాడారు. ప్రపంచంలోనే అత్యుత్తమ యూనివర్సిటీలలో అనేక అంశాలపై సీతారాం ఏచూరితో ఉపన్యాసాలు ఆయన ఆహ్వానించి మరీ ఇప్పించేవారన్నారు. అందుకే దేశం ఒక గొప్ప మేధావిని కోల్పోయిందన్నారు. ఏచూరి మరణానికి తీవ్ర సంతాపం తెలియజేస్తూ, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షులు కొండం సంజీవ్, జిల్లా నాయకులు చెప్యాల సంతోష్ , బత్తుల అభిషేక్ భాను, స్వాతి, అంజలి తదితరులు పాల్గొన్నారు.



చెరువు మత్తడికి బుంగ

వృధాగా పోతున్న నీరు

నవ తెలంగాణ-కొండపాక

కొండపాక శివారులోని పోతారెడ్డి చెరువు మత్తడికి బుంగ పడింది. ఇటీవల వరుసగా కురిసిన వర్షాలకు చెరువులోకి భారీగా నీరు చేరింది. దాదాపు మత్తడి వరకు నీరు రావడంతో మత్తడి కింది భాగంలో రెండు మూడు చోట్ల బుంగ ఏర్పడడంతో నీరు వృధాగా పోతుంది . ఈ చెరువు కింద సుమారు 75 ఎకరాల సాగు విస్తీర్ణం ఉంది. మత్తడి లీకేజీని పూడ్చుకుంటే నీరు అంతా వృధాగా పోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే మరమ్మతు చేపట్టాలని కోరుకున్నారు.

సంగారెడ్డిలోని సీఐటీయూ కార్యాలయంలో సీఐటీయూ ఆధ్వర్యంలో నాయకులు సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి విప్లవ జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సాయిలు, యాదగిరి, రమేశ్, దత్తు తదితరులు పాల్గొన్నారు.



కోతిని కాపాడిన గ్రామస్తులు

నవ తెలంగాణ - కొండపాక

ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురైన కోతిని కొండపాక మండలం సిరసనగండ్ల గ్రామస్తులు కాపాడి ఫారెస్ట్ అధికారులకు అప్పగించిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామ బస్టాప్ వద్ద కోతులు విద్యుత్ వైర్ నుంచి వెళ్లడంతో ఒక కోతికి ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై కింద పడింది. తీవ్ర అస్వస్థతకు గురైన విషయాన్ని గ్రామస్తులు గమనించి కోతిని ఒకచోట ఉంచి ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో బీట్ అధికారి సురేష్ చేరుకొని కోతిని తేజోవనం అర్బన్ పార్క్ కు తరలించారు.



నేడు ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

హాజరుకానున్న మంత్రి దామోదర రాజనర్సింహా

నవతెలంగాణ-జోగిపేట

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా అందోలు నియోజకవర్గ పరిధిలోని 9 మండలాల ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కార ప్రధానోత్సవ కార్యక్రమాన్ని సంగుపేట వద్ద గల లక్ష్మీదేవి గార్డెన్లో నేడు(శుక్రవారం) నిర్వహించనున్నట్లు ఉపాధ్యాయ పురస్కార నిర్వహణ కమిటీ సభ్యులు ఆకుల మానయ్య తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సి.దామోదర రాజనర్సింహా, జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరి, జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు హాజరుకానున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ పరిధిలోని ఉపాధ్యాయులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

నవతెలంగాణ-అమీన్‌పూర్



ప్రభుత్వ భూమిని ఆక్రమించి సర్వేనెంబర్ 993లో వెలిసిన అక్రమ నిర్మాణాలను అమీన్‌పూర్ తహసీల్దార్ రాధా నేతృత్వంలో రెవెన్యూ శాఖ అధికారులు జేసీబీల సహాయంతో గురువారం కూల్చివేశారు. ప్రభుత్వ భూమిని కబ్జా చేసి విక్రయానికి పాల్పడ్డ, నిర్మాణాలు చేసినా ఊరుకునే ప్రసక్తి లేదని అలాంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అమీన్పూర్ రెవెన్యూ సిబ్బంది రఘునాథ్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు 128 ఎంపిక



నవతెలంగాణ-జోగిపేట

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అందోల్ మండల స్థాయి క్రీడా పోటీల్లో 128 మంది జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. గురువారం జోగిపేట పట్టణంలో బాలుర పోటీలను నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో జరిగిన ఈ సెలక్షన్సలో వాలీబాల్, కోకో, కబడ్డీ అంశాల్లో బాలుర, బాలికల విభాగం నుంచి 64 మంది, బాలుర విభాగం నుంచి 64 మంది ఎంపికయ్యారు. ఎంపికైన వారికి మెమొంటోలు, బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో జోగిపేట పాఠశాల హెచ్‌ఎం నరేష్, పీడీలు వీబీ శ్రీనివాస్, రామ కృష్ణ, సుభాష్ గౌడ్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ అధ్యాపకులకు సన్మానం

నవతెలంగాణ-జిన్నారం



మండల కేంద్రానికి చెందిన ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్లు రవీందర్, కృష్ణారావులును ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి గురువారం సన్మానించారు. ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ప్రతీయేడు గురుపూజోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ఉత్తమ అధ్యాపకులను సన్మానిస్తున్నారు. అందులో భాగంగా ఈయేడు జిన్నారానికి సంబంధించి రవీందర్, కృష్ణారావులును సన్మానించారు. అవార్డు రావడం పట్ల ఆ ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేశారు.

నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ ఓ వరం..




నవతెలంగాణ-పుల్కల్

అనారోగ్యంతో బాధపడుతూ వైద్య ఖర్చుల కోసం ఇబ్బంది పడుతున్న నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ ఓ వరమని కాంగ్రెస్ పార్టీ చౌటకూర్ మండలాధ్యక్షులు నత్తి దశరథ్ అన్నారు. చౌటకూర్ మండలంలోని బొమ్మారెడ్డిగూడెం, శివంపేట గ్రామాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులను గేనేవానం ఆయన పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ.. నిరుపేదల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి సీఎం సహాయ నిధి మంజూరు చేస్తున్నారన్నారు. అంతేకాకుండా ఆందోల్ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు మంత్రి కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మల్లారెడ్డి, ఈశ్వర్ గౌడ్, రఘునాయక్, శివంపేట మాజీ ఎంపీటీసీ కిరణ్ గౌడ్, నాయకులు మల్లికార్జున్ గౌడ్, డబ్బి మల్లేశం, సంగు భరత్ తదితరులు పాల్గొన్నారు.

సత్తయ్య యాదవ్ స్మారకార్థం విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ

నవతెలంగాణ-గుమ్మడిదల



గుమ్మడిదల గ్రామానికి చెందిన దాసరి సత్తయ్య యాదవ్ స్మారకార్థం ద్వితీయ వర్ధంతిని పురస్కరించుకొని గురువారం హాస్టల్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో పాటు ఉచితంగా ప్లేట్లను కుమారులు దాసరి మల్లేష్ యాదవ్ ఆంజనేయులు యాదవ్ శ్రీనివాస్ యాదవ్ లతోపాటు మండల మాజీ జెడ్పిటిసి కుమార్ గౌడ్ సిజిఆర్ ట్రస్ట్ చైర్మన్ బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ మొగులయ్య, చిమ్ముల దేవేందర్ రెడ్డి, ఎలుక బాలరాజు, అంజయ్య, వెంకటేష్, రాహుల్, నాగార్జున, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ముకుందనాయక్‌తాండాలో డీజే సీజ్



నవతెలంగాణ-కంగ్టి

మండలంలోని ముకుందనాయక్‌తాండాలో గణేష్ నిమజ్జనం వద్ద పెట్టిన డీజేను ఎస్సై విజయ్‌కుమార్ సీజ్ చేశారు. డీజే నిర్వాహకుడు రాథోడ్ సునీల్‌పై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా గణేష్ నిమజ్జనానికి డీజేలకు ఎలాంటి పర్మిషన్ లేదన్నారు. చట్టాన్ని ఉల్లంఘించి డీజేలు పెడితే చట్టపైన చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్ఐతో పాటు ఏఎస్ఐ నారాయణ తదితరులు ఉన్నారు.

శ్లోక ఇంటర్నేషనల్ పాఠశాలలో వినాయక చవితి

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం



శ్లోక ఇంటర్నేషనల్ పాఠశాలలో వినాయక చవితి సంబురాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురువారం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసారు. అన్నదానం అనంతరం ఘనంగా గణనాథుడిని నిమజ్జనం చేసారు. ఈ కార్యక్రమంలో శ్లోక ఇంటర్నేషనల్ పాఠశాల వ్యవస్థాపకుడు కొత్వల్ హరికృష్ణ రెడ్డి, వారి కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రులు, పాఠశాల సిబ్బంది తదితరులు హాజరయ్యారు.

ఘనంగా అన్నదాన కార్యక్రమం

నవతెలంగాణ-పాపన్నపేట



పాపన్నపేటలో గురువారం పాత పోస్ట్ ఆఫీస్ గణేష్ మండపం వద్ద అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అన్నదాతగా రాజు చౌదరి వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో విగ్రహ దాత శ్రీకాంత్, హనుమాన్ యూత్ సభ్యులు శ్రీరాం దుర్గయ్య, యాదయ్య బేతయ్య, శివగౌడ్, విష్ణు, అజయ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.........

పొలాల్లో నిలువ ఉన్న నీటిని రైతులు తొలగించుకోవాలి

ఏఈఓ విజృంభణ

నవతెలంగాణ-నార్సింగి

గత వారంలో కురిసిన అధిక వర్షాల ప్రభావం వల్ల, వాతావరణం చీడపీడలు అధికంగా సోకడానికి అనుకూలంగా ఉన్న నేపథ్యంలో గురువారం నార్సింగి పరిధిలో వరి పంట క్షేత్రాలను పరిశీలించడం జరిగిందని వ్యవసాయ విస్తరణ అధికారిని విజృంభణ తెలిపారు. వాతావరణ పరిస్థితుల ప్రభావం వల్ల వరి పంటలో వివిధ చీడపీడలు సోకే అవకాశం ఉందని, ముఖ్యంగా ప్రస్తుతం వరి పంట పిలకలు వేసే దశలో ఉన్నందున, అధిక వర్షాల ప్రభావం వల్ల పొలంలో నిలువ ఉన్న నీటిని మొత్తం తీసివేసి పొలాన్ని ఆరబెట్టాల ని సూచించారు. ఎక్కువ నీరు నిలబడి నిలువ ఉండడం వల్ల వేరు వ్యవస్థకు సరైన పోషకాలు అందవని, పై పాటుగా పోషకాలను పిచికారి చేయవలసి ఉంటుందని, బూస్టల్ డోజుగా 25 కేజీల యూరియా 15 కేజీల పొటాష్ జల్లు కోవాలని అన్నారు. ఒకవేళ కాండం తొలుచు పురుగు లేదా ఆకు ముడత పురుగు ను పొలంలో గమనించి నట్లయితే నత్రజని వాడకంను వాయిదా వేసుకోవాలని, వాటి నివారణ కోసం ప్రారంభ దశలో కార్టఫ్ హైడ్రో క్లోరైడ్ గుళికలను నాలుగు కేజీలు, లేదా క్లోరంత్రోనిప్రోలు నాలుగు కేజీలు, లేదా ఫిప్రోనిల్ గుళికలను నాలుగు కేజీలు చల్లుకోవాలని పేర్కొన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల ప్రభావం వల్ల ఎండు తెగులు బ్యాక్టీరియా గమనించడం జరిగిందని, వాటి నివారణకు ఎకరాకు 400 గ్రాముల కాపర్ ఆక్సీ క్లోరైడ్ మరియు 40 గ్రాముల ప్లాంటోమైసిన్ కలిపి పిచికారి చేసుకోవాల్సి ఉంటుందని వివరించారు. అగ్గి తెగులు వంటి ఇతర తెగుల నివారణ కోసం ప్రారంభ దశలో ట్రైసైక్లోజోల్ ఎకరాకు 120 గ్రాముల చొప్పున పిచకారి చేసుకోవాలని, మోతాదుకు మించి యూరియా వాడడం వల్ల చీడపీడల ఉధృతి పెరిగే అవకాశం ఉంది కాబట్టి యూరియా వాడకాన్ని తగ్గించుకోవాలని, ఒకవేళ యూరియా



వేయాలనుకుంటే తప్పనిసరిగా పొటాష్ కలిపి వేసుకోవాలని చెప్పారు. పొటాష్ వేసుకోవడం వల్ల మొక్కకు రోగ నిరోధక శక్తి పెరిగే అవకాశం ఉందని, కాబట్టి రైతులు ప్రస్తుత వాతావరణ పరిస్థితుల పట్ల అప్రమత్తతో ఉంటూ ఎప్పటికప్పుడు చీడ పీడల్ని గమనించి వ్యవసాయ అధికారుల సూచనల మేరకు తెగులు, పురుగుమందుల పిచికారి చేయాల్సిందిగా విజృంభణ రైతులకు సూచనలు చేసారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తీర్ణ అధికారి విజృంభణ రైతులు పాల్గొన్నారు.

దేశ అభివృద్ధి బీజేపీతోనే సాధ్యం

నవతెలంగాణ-తొగుట

దేశ అభివృద్ధి బీజేపీతోనే సాధ్యం అవుతుందని బీజేపీ మండల అధ్యక్షుడు జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు తిరుమల్ రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో బీజేపీ సభ్యత్వం నమోదు చేసి సభ్యత్వ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు మెదక్ పార్లమెంట్ సభ్యులు మధవనేని రఘునందన్ రావు ఆదేశాను సారం జిల్లా అధ్యక్షులు గంగాడి మోహన్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బూరెడ్డిగారి విభీషణ్ రెడ్డి సూచన మేరకు తొగుట మండల కేంద్రంలో సభ్య త్వం నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించామని అన్నారు. ఇంటింటా తిరిగి బీజేపీ సభ్యత్వ నమో దు చేయాలి అని బూత్ అధ్యక్షులను, కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు చిక్కుడు చంద్రం, చందాపూర్ మాజీ సర్పంచ్ బొడ్డు నర్సింలు, నాయకులు ఐలిగొండ చంద్రశేఖర్ గౌడ్, మల్లుగారి శ్రీకాంత్ రెడ్డి, నంట స్వామిరెడ్డి, పాగాల రాజిరెడ్డి, మాదారం ప్రవీణ్, కొమ్ము కర్ణాకర్, బాల్ రెడ్డి, జిల్లా కిసాన్ మోర్చా సోషల్ మీడియా కన్వీనర్ తిరుపతి పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు ప్రారంభం

నవతెలంగాణ-బెజ్జంకి

మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బీజేపీ సభ్యత్వ నమోదును బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై గురువారం ప్రారంభించారు. బీజేపీ పార్టీ సభ్యత్వ నమోదును విస్తృతంగా చేపట్టాలని నాగేశ్వర్ రెడ్డి బీజేపీ శ్రేణులకు సూచించారు. మండలాధ్యక్షుడు కొలిపాక రాజు, బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కరివేద మహిపాల్ రెడ్డి,రాష్ట్ర నాయకుడు సొల్లు అజయ్ వర్మ,మండల ఉపాధ్యక్షుడు కొత్తపేట రామచంద్రం,గైని రాజు, దొమ్మాటి రాములు, పట్టణాధ్యక్షుడు సంగ రవి, మండల నాయకులు గంప రవికుమార్, సాన వేణు,రావుల బాల్ రెడ్డి,రావుల రాజి రెడ్డి,ఒగ్గు కనకయ్య, శీలం వెంకటేష్ పాల్గొన్నారు.

ఘనంగా కుంకుమార్చన, మహా అన్నదానం

నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల పట్టణ కేంద్రం ఏడో వార్డులోని మైసమ్మ వీధిలో వినాయక నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మైసమ్మ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో గురువారం కుంకుమార్చన, కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం మహా అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు ఎర్రోళ్ల భాను, కొత్తపల్లి రాకేష్, మేర్గోజు ప్రవీణ్, కృష్ణ కాంత్, పాల్గొన్నారు.

వికసిత్ భారత్ కోసం బీజేపీలో చేరుదాం

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాంగోపాల్ రెడ్డి.

నవతెలంగాణ-అక్కన్నపేట

దేశ రక్షణలో మన పాత్ర ఉండాలంటే భారతీయ జనతా పార్టీ సభ్యత్వం తప్పక పొందాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి అన్నారు. గురువారం అక్కన్నపేట మండల అధ్యక్షుడు రామంచ మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో అక్కన్నపేట మండలం కట్కూర్ గ్రామంలో సభ్యత్వ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రాంగోపాల్ రెడ్డి మాట్లాడుతూ నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్ అన్ని రంగాల్లో దూసుకెళుతున్నదని, మోదీ నాయకత్వాన్ని బలపరుస్తూ భారతదేశాన్ని ప్రపంచలోనే అగ్రస్థానంలో నిలిపేందుకు మన సభ్యత్వం తోడ్పడుతుందన్నారు. మండలంలోని అన్ని పోలింగ్ బూత్ లలో పెద్ద ఎత్తున బీజేపీలో ప్రజలు చేరాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి మడక రవికుమార్, సభ్యత్వ నమోదు కన్వీనర్ సునావత్ మోహన్ నాయక్, సిద్దిపేట జిల్లా ఎస్టీ మోర్చాసభ్యత్వ నమోదు ఇంచార్జ్ సుధాకర్ నాయక్, మాజీ సర్పంచ్‌లు జిల్లాల అశోక్ రెడ్డి, బానోత్ రవీందర్ రాజ్ కుమార్, సందబోయిన కుమార్, మండల ఉపాధ్యక్షుడు ఇరిగిండ్ల రాజకుమార్, తీగల శ్రీనివాస్, చింతల లింగారెడ్డి, దశమంత రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, రవీంద్ర చారి, రాజ్ కుమార్ నాయక్, సమ్మయ్య నాయక్, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

తూప్రాన్ లో సెల్ ఫోన్ దొంగల అరెస్టు

తూప్రాన్ ఎస్ఐ శివానంద్

నవతెలంగాణ - తూప్రాన్

తూప్రాన్ పట్టణంలో సెల్ ఫోన్ల నలుగురు దొంగలను తూప్రాన్ పోలీసులు పట్టుకొని గురువారం రోజున అరెస్టు చేసినట్లు తూప్రాన్ ఎస్ఐ శివానంద్ ఈ సందర్భంగా తూప్రాన్ ఎస్ఐ శివా నందు తెలిపిన వివరాల ప్రకారం తూప్రాన్ మున్సిపాలిటీలోని రావెల్లి గ్రామానికి చెందిన బానపురం రాజు తన ఫోన్ తూప్రాన్ బస్టాండ్ లో ఎవరో గుర్తు తెలియని దొంగ దొంగిలించాడని మరుసటి 10.09.2024 రోజున తూప్రాన్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు ఇవ్వగా, 12 సెప్టెంబర్ 2024 గురువారం రోజున తూప్రాన్ బస్టాండ్ వద్ద తూప్రాన్ పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా ఒక షిఫ్ట్ డిజైర్ కారు లో నలుగురు వ్యక్తులు అనగా ఇద్దరు పిల్లలు ఇద్దరు పెద్దలు కలిసి సెల్ ఫోన్ లు దొంగతనం చేద్దామని వస్తుండగా, పోలీస్ వారు అట్టి కారు ను ఆపి విచారించగా వారు అనుమాస్పదంగా మాట్లాడటంతో వారిని పట్టుకొని,వారి వద్ద నుండి 17 సెల్ ఫోన్ లు, నగదు 5000/- రూపాయల నగదు, ఒక కారును తూప్రాన్ పోలీసులు స్వాదినపర్చుకున్నారు. దొంగిలించిన 17 సెల్ ఫోన్ లు కూడా అందరు కలిసి దొంగతనం చేసిన ఫోన్ లుగా ఒప్పుకున్నారు. ఈ వ్యక్తులను కోర్టు కి పంపించడం జరిగింది. ప్రధాన నిందుతుడు ప్రభు పరారిలో ఉన్నాడు.దొంగతనం చేసిన సెల్ ఫోన్ లను ప్రధాన నిందుతుడు ప్రభు తీసుకొని కింద తెలిపిన నిందుతులకు సెల్ ఫోన్ లను దొంగతనం చేసినందుకు డబ్బులను ఇస్తాడు. ఈ రోజు కోర్టు లో హాజరు పరిచిన నిందుతుల వివరాలు: ఈడిగా రవి కుమార్ గౌడ్ రైల్వే కోటర్స్ స్టేషన్ రోడ్, డోన్ మండలం నంద్యాల జిల్లా, సత్వాడి అరవింద్,పంపన్న గౌడ్ కాలని ఎమ్మిగనూర్ మండలం, కర్నూల్ జిల్లా,ఇద్దరు బాలురు(13 సం: లు) మైనర్ లు ఉండటం వలన వారి వివరాలు తెలుపలేకపోతున్నామన్నారు.సెల్ ఫోన్ లను దొంగలించిన వారిని అరెస్టు చేసి, విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ శివనంద్ తెలిపారు.

హరీష్ రావు అరెస్టు అప్రజాస్వామ్యం

బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు సరాఫ్ సతీష్ చారి

నవతెలంగాణ - తూప్రాన్



మాజీ మంత్రి హరీష్ రావును అరెస్టు చేయడం అప్రజాస్వామికం అని బిఆర్ఎస్ తూప్రాన్ మున్సిపల్ అధ్యక్షులు సరాఫ్ సతీష్ చారి గురువారం నాడు మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా తూప్రాన్ మున్సిపల్ లో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజా సంక్షేమ పరిపాలన ప్రక్కన పెట్టి,6 గ్యారంటీలు అమలు చేయకుండా ,ప్రతిపక్షాలను టార్గెట్ చేస్తూ, గురువారం రోజున మాజీ మంత్రి హరీష్ రావును అరెస్టు చేయడం బాధాకరమన్నారు. ప్రజలు కాంగ్రెస్ పై అసంతృప్తితో ఉండడంతో వారి దృష్టి మరల్చడానికి ప్రతిపక్షాల నాయకులను అరెస్టులకు పాల్పడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం తీరు మార్చుకోవాలన్నారు. ప్రజా పరిపాలన మీద శ్రద్ధ చూపాలని ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు సతీష్ చారి డిమాండ్ చేశారు.

గణనాథుడికి ప్రత్యేక పూజలు చేసిన నర్సారెడ్డి

స్వాగతం పలికిన వినాయక మండపాల నిర్వాహకులు మున్సిపల్ చైర్ పర్సన్,వైస్ చైర్మన్

నవతెలంగాణ - తూప్రాన్

తూప్రాన్ పట్టణంలోని పలు వినాయక మండపాలలో గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి గణనాథుడికి గురువారం రోజున ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి మాట్లాడుతూ అన్ని విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడి ఆశీస్సులు ప్రజలందరికీ ఎల్లవేళలా ఉండాలని భగవంతుడిని ప్రార్థించానన్నారు. తూప్రాన్ పట్టణం భవిష్యత్తులో మరింత అభివృద్ధి చెందడానికి భగవంతుడి ఆశీస్సులు కావాలని, ప్రజల మన్ననలు పొందాలని, ప్రగతి పథంలో దూసుకెళ్లడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. తూప్రాన్ మున్సిపాలిటీని కాంగ్రెస్ ప్రభుత్వ హాయంలో మరిన్ని ఎక్కువ నిధులు తీసుకొచ్చి పూర్తిస్థాయిలో అభివృద్ధిని చేసి చూపిస్తామన్నారు. అనంతరం వినాయక మండప నిర్వహకులు గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డిని శాలువాతో సత్కరించి,మెమొంటో బహూకరించారు. అనంతరం మున్సిపల్ చైర్పర్సన్ మామిండ్ల జ్యోతి కృష్ణ, వైస్ చైర్మన్ నందాల శ్రీనివాస్ లతో పాటు కౌన్సిలర్లను కాంగ్రెస్ పార్టీ నాయకులను సన్మానించి సత్కరించారు.ఈ కార్యక్రమంలో తూప్రాన్ మున్సిపల్ చైర్ పర్సన్ మామిండ్ల జ్యోతి కృష్ణ, వైస్ చైర్మన్ నందాల శ్రీనివాస్ ,కౌన్సిలర్లు జిన్నా భగవాన్ రెడ్డి ,పల్లెర్ల జ్యోతి రవీంద్ర గుప్తా, రవీందర్ రెడ్డి ,తూప్రాన్ కాంగ్రెస్ పార్టీ యూత్ పట్టణ అధ్యక్షులు నాగరాజుగౌడ్,ఉమర్ ,అనిల్ , దుర్గం నగేష్, కాణిపాక యూత్ సభ్యులు, యువజన సంఘాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

జిఎంఆర్ వరలక్ష్మీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బీసీ గురుకుల బాలికలకు ఉచిత వైద్యం

జి.యం.ఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బి.సి గురుకుల బాలికలకు ఉచిత వైద్యం

వరలక్ష్మి ఫౌండేషన్ కో ఆర్డినేటర్ శ్రీనివాస్

నవతెలంగాణ - తూప్రాన్

తూప్రాన్ పట్టణంలోని మహాత్మ జ్యోతి బాపూలే నర్సాపూర్,వెల్దుర్తి గురుకుల పాఠశాల,కళాశాలలో జి.యం.ఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా గత వారం వైద్య శిబిరం నిర్వహించగా కొంతమంది విద్యార్థినిలకు వైద్య సహాయం అత్యవసరమైన వారిని వైద్యులు గుర్తించారు. వైద్య సేవలు అవసరమైన విద్యార్థినిలను గురువారం రోజున సి.యం.ఆర్ హాస్పటల్ కండ్లకోయకి తీసుకెళ్లి నిపుణులైన వైద్యులచే ఉచితంగా అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి ,తగిన మందులు విద్యార్థినిలకు అందించారు.అంతేకాకుండా భవిష్యత్తులో అనారోగ్య సమస్యలు తిరిగి పునరావృతం కాకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో నిపుణులైన వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా జి.యం.ఆర్ నేషనల్ హైవే ప్రాజెక్ట్ మేనేజర్ వెంకటరమణ విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడుతూ ఎప్పుడు అత్యవసర వైద్య సదుపాయం అవసరమైన మా వంతు సహకారం అందిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో జి.యం.ఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ కో ఆర్డినేటర్ శ్రీనివాస్, సీఎంఆర్ హాస్పిటల్స్ పి ఆర్ ఓ దుర్గ ప్రసాద్ రెడ్డి , కో ఆర్డినేటర్లు మధు,రాజ్ నారాయణ, పాఠశాల సిబ్బంది,విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

నివాళి

నిరాడంబరతకు నిలువెత్తు సాక్ష్యం
నిజాయితీకి ఒక నిలువుటద్దం
నిబద్ధతకు తనకు తానే సా(మే)టి
పేదల పెన్నిధి నిరుపేదల పక్షపాతి
రైతుల బంధువు కార్మికులకు అండ
అన్యాయాలను అక్రమాలనెపుడూ
ప్రశ్నించే ఒక నిర్భయ గొంతుక
నిష్క్రమించిందనే విషయం జీర్ణించుకోలేని సత్యం
చీకట్లను చీల్చుకొని వచ్చే ఒక ఎర్రని మెరపు
మన మధ్య నుండి మాయమయ్యింది
పలు సమస్యలకు పరిష్కారమును సూచించే
ఒక అనంతమైన దిక్సూచి అదృశ్యమయ్యింది
ఒక మేధాశక్తి మనకు దూరమయ్యింది
ఒక మహోన్నత శిఖరం ఒరిగి పోయింది
అనేక మందికి ఆదర్శంగా ని(గె)లిచిన వ్య(శ) క్తి
మనకు భౌతికంగా దూరం కావచ్చు
కష్టజీవుల కన్నీళ్లుతుడవగ బడుగు జీవుల
బతుకు మార్చగ
మనకు మహిపైన మరో రూపంలో అగుపించవచ్చు
పుడమిపై మళ్ళీ పుడతాడని మంచికై నడుస్తాడని
వేగుచుక్కవై వెలుగు దీప్తి వై కనిపిస్తాడని
సీతారాం ఏచూరి తిరిగి పుడతాడని
మనమందరం ఆశిద్దాం ఆకాంక్షిద్దాం



ఎలికట్టె అయిలయ్య
కవి, రచయిత, చేర్యాల
9989613096
నవతెలంగాణ-చేర్యాల

హరీష్ రావు అరెస్టు అప్రజాస్వామికం



గజ్వేల్ నియోజకవర్గం ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి

నవ తెలంగాణ- గజ్వేల్

మాజీమంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు అరెస్టు అప్రజాస్వామికమని గజ్వేల్ బీఆర్ఎస్ ఇన్చార్జి వంటేరు ప్రతాపరెడ్డి అన్నారు. బీ ఆర్ఎస్ పార్టీ బీఫామ్ మీద గెలిచిన పదిమంది ఎమ్మెల్యేలు తక్షణమే రాజీనామా చేసి ప్రజాక్షేత్రంలో దమ్ముంటే పోటీ చేయాలని వంటేరు ప్రతాపరెడ్డి డిమాండ్ చేశారు. బీ ఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలోకి పోయిన పదిమంది ఎమ్మెల్యేలకు కౌశిక్ రెడ్డి వేసిన సవాల్ ను స్వీకరించక ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఇంటి పైకి రాళ్లతో , కంకర రాళ్లతో, టమాటోలతో, గుడ్లతో ఇల్లును ధ్వంసం చేయడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే అని అన్నారు.వెంటనే దాడి చేసిన ఎమ్మెల్యే ఆర్కే పూడి గాంధీ పై అతని అనుచరులపై కేసును కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టని పక్షంలో ఎఫ్ఐఆర్ చేయని పక్షంలో ప్రజాస్వామ్యబద్ధంగా కమీషనరేట్ ముందు నిరసన తెలుపుతున్న మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు ని అరెస్టు చేయడం అప్రజాస్వామికమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రౌడీ రాజకీయాలకు ఊపిరి కలుపుతుందని మండిపడ్డారు.దానికి నిదర్శనమే ఈరోజు ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఇంటిపై జరిగిన ఘటన అన్నారు, కాంగ్రెస్ నాయకులు కాంగ్రెస్ నాయకులు గుండాలుగా రౌడీలుగా ఎమ్మెల్యేలపై దాడులు చేయడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే అన్నారు, దీనికి నైతిక బాధ్యత వహిస్తూ రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు

దేవాలయంలో సామూహిక కుంకుమార్చన



నవతెలంగాణ-చేగుంట

చేగుంట పట్టణ కేంద్రం రైల్వే స్టేషన్ రోడ్‌లో ఉన్న కన్యకా పరమేశ్వరి దేవాలయంలోని వినాయక మండపంలో గురువారం మహిళలందరూ కలిసి సామూహిక కుంకుమార్చన, పారాయణం, భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వాసవి మహిళ సభ్యులు, వైశ్య సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

పెద్ద చెరువుకట్టపై గణేష్ నిమజ్జనానికి ఏర్పాట్లు

పరిశీలించిన డీఎస్పీ వెంకటరెడ్డి

నవతెలంగాణ - తూప్రాన్



తూప్రాన్ మున్సిపాలిటీలోని పెద్ద చెరువు కట్టపై వినాయక నిమజ్జనానికి తూప్రాంట్ ఎస్పీ వెంకటరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లను పరిశీలించారు.వినాయక నిమజ్జనం రోజున ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సామరస్య వాతావరణంలో నిమజ్జనాన్ని పూర్తి చేయుటకు పెద్ద చెరువు కట్ట వద్ద నిమజ్జనానికి అనువైన స్థలాన్ని మున్సిపల్ చైర్ పర్సన్ మామిళ్ల జ్యోతి కృష్ణ ముదిరాజు అధికారులతో కలిసి పరిశీలించడం జరిగింది.ఈ కార్యక్రమంలో డీఎస్పీ వెంకటరెడ్డి, సిఐ రంగకృష్ణ, తూప్రాన్ ఎమ్మార్వో విజయలక్ష్మి,ఎస్ఐ శివానంద్,తూప్రాన్ పురపాలక సంఘ వైస్ చైర్మన్ నందాల శ్రీనివాస్,మున్సిపల్ కమిషనర్ ఖాజా మొయిజుద్దీన్, కౌన్సిలర్లు శ్రీశైలం గౌడ్, పల్లెర్ల జ్యోతి రవీందర్ గుప్తా,రవీందర్ రెడ్డి,కుమ్మరి రఘుపతి,కాంగ్రెస్ నాయకులు ఉమర్,నాగరాజు గౌడ్, అనిల్,మున్సిపల్ మేనేజర్ రఘువరన్ ,జూనియర్ అసిస్టెంట్ దుర్గయ్య,మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పలు గణేష్ మండపాలను దర్శించుకున్న వరప్రసాద్ రెడ్డి

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

స్థానిక జ్యోతినగర్‌లో ఏర్పాటుచేసిన గణేష్ మండపం వద్ద నిర్వాహకులు చేపట్టిన అన్నదాన కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక నాయకులు వి.వరప్రసాద్‌రెడ్డి పాల్గొని భక్తులకు అన్నదాన వితరణ చేశారు.నాయకులు శేఖర్, దిలీప్, సతీష్, సురేష్, జయరాం, ప్రసాద్,సాయి, ఢిల్లీ తదితరులు పాల్గొన్నారు.

బాలాజీ నగర్ గణేశుడికి ప్రత్యేక పూజలు..

ఆరో వార్డు బాలాజీ నగర్‌లో కౌన్సిలర్ గుండ్ల మహేందర్‌రెడ్డి ఏర్పాటు చేసిన గణేష్ మండపాన్ని మున్సిపల్ వైస్ చైర్మెన్ అనిల్ కుమార్‌రెడ్డితో సందర్శించి గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలాజీ నగర్ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు కాంగ్రెసు సీనియర్ నాయకులు మహేందర్ రెడ్డి, వరప్రసాద్ రెడ్డి,



అనిల్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ నీహారిక, ప్రత్యూష, రాజశేఖర్ రెడ్డి, సాయి తేజ, జాకీర్, రూపేష్, సతీష్, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, యువకులు, కాలనీవాసులు, భక్తులు పాల్గొన్నారు.

గణనాథుల వద్ద అన్నదాన కార్యక్రమాలు

నవతెలంగాణ-జహీరాబాద్

నియోజకవర్గంలోని వినాయక విగ్రహాల వద్ద ముమ్మరంగా అన్నదాన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ సంఘాల నాయకులు మండపాల వద్దకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమంలో పాల్గొంటున్నారు. సార్వజనిక ఉత్సవ కమిటీ సభ్యులు, అధికారులు జహీరాబాద్ మండలంలోని హొతి బి నారింజ డ్యాం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేసి.. వచ్చిన విగ్రహాలను వచ్చినట్లు నిమజ్జనం చేస్తున్నారు.

నిమజ్జన సమయంలో జాగ్రత్తలు తప్పనిసరి..

వర్షాలు భారీగా కురియడంతో నారింజ డ్యామ్ నిండు కుండలా మారింది. కాబట్టి నిమజ్జనానికి కొద్దిమంది మాత్రమే రావాలని పోలీస్ అధికారులు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి విజ్ఞప్తి చేస్తున్నారు. చిన్నపిల్లలను తీసుకురావొద్దన్నారు. శాంతియుతంగా నిమజ్జనాలు జరపాలన్నారు.



దేశద్రోహి రాహుల్ గాంధీ దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలి

నవతెలంగాణ-సిద్దిపేట



కాంగ్రెస్ పార్టీ నాయకులు రాహుల్ గాంధీ భారత వ్యతిరేక శక్తులతో విదేశాల్లో సమావేశాలు నిర్వహిస్తూ, భారత దేశంపైన వ్యతిరేక వ్యాఖ్యలు చేస్తూ ఈ దేశం మీద ఆయనకున్న వ్యతిరేకతను మరొకసారి చాటుకుంటు న్నారని, దేశద్రోహి రాహుల్ గాంధీ దేశ ప్రజల క్షమాపణ చెప్పాలని బిజెపి పట్టణ అధ్యక్షులు కోడూరి నరేష్ డిమాండ్ చేశారు. గురువారం అంబేద్కర్ సర్కిల్‌లో రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను బీజేపీ నాయకులు దగ్ధం చేశారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ ఈ మధ్య జరిగిన పార్లమెంట్ సమావేశాల్లో కూడా హిందువులు విధ్వంసకారులు, మైనారిటీల మీద దాడులు చేస్తున్నారని, హిందువులు ఉగ్రవాదులాగా పోలుస్తూ వ్యాఖ్యలు చేశారన్నారు. విదేశాల్లో వెళ్ళినప్పుడు దేశ వ్యతిరేక శక్తులతో, కలిస్తాన్ వేర్పాటువాద ఉగ్రవాద సంస్థలతో, పాకిస్తాన్‌కి అనుకూలంగా భారతదేశానికి వ్యతిరేకంగా కార్యకలా పాలను నిర్వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బొమ్మగాని పద్మ అర్బన్ మండల అధ్యక్షులు వరప్రసాద్, బాసంగారి వెంకట్, పట్టణ ప్రధానకార్యదర్శులు పిట్ల నరేష్, బొడ్డు సునీల్, కమ్మసారం సంతోష్, ఓబీసీ మోర్చా నాయకులు భోగి శ్రీనివాస్,.పట్టణ అధికార ప్రతినిధి మెరుగ ఎల్లం గౌడ్, తాటికొండ శ్రీనివాస్, బీజేవైఎం జిల్లా నాయకులు గిరి, సుతారి కార్తీక్, శ్రీనివాస్, వెంకట్రావు, యాదగిరి, శంకర్, లింగం, పాల్గొన్నారు.